శుక్రవారం
27-05-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 333
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సామ్రాజ్యవాద కూటమి అత్యంత ప్రమాదకారి

కమ్యూనిస్టులుగా ప్రతి సామ్రాజ్యవాద కూటమి బలపడటాన్ని వ్యతిరేకిస్తాం. సమకాలీన ప్రపంచంలో బలమైన సామ్రాజ్యవాద కూటమి నాటోలో స్వీడన్ చేరిక అంశంపై కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ స్వీడన్ (ఎస్‌కేపీ) చైర్మన్ ఆండ్రియాస్ సోరెన్‌సెన్ వామపక్ష టర్కిష్ వార్తాపత్రిక 'ఎవ్రెన్‌సెల్' కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పైవిధంగా వ్యాఖ్యానించారు.

5లో

కరోనా వాక్సిన్ వికటించి విద్యార్థిని మృతి !

విశాలాంధ్ర- హుకుంపేట: కరోనా వ్యాక్సిన్ వికటించడం వలనే తమ కుమార్తె మృతి చెందిందని ఓ గిరిజన విద్యార్థిని తల్లిదండ్రులు విలపించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, డుంబ్రిగుడ మండలం పెద్దగరువు ఆశ్రమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సీదరి స్వాతి (13) ఈనెల 3న పాఠశాలలో కోవిడ్ వాక్సిన్ టీకా తీసుకుంది. మూడురోజుల తరువాత నుంచి జ్వరం, వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురికావడంతో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో నెల 18న పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి మరింత విషమించడంతో విశాఖ కేజీహెచ్ తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం ఉదయం మృతి చెందింది. అయితే వాక్సిన్ వికటించి మృతి చెందిందా లేదా ఇతర కారణాల వల్ల మరణించిందా అనేది నిరార్ధరణ కావాల్సి ఉంది. కాగ తిగలవలస పంచాయతీ బీజాపల్లి గ్రామనికి చెందిన స్వాతి తల్లిదండ్రులు అప్పటి వరకూ బాగానే ఉన్న తమ కూతురు వాక్సిన్ వేసుకున్న మూడురోజుల తరువ్వా అస్వస్థతకు గురైందని, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని వాపోతున్నారు.

ఏపీ గ్రామీణాభివృద్ధి శాఖకు అరుదైన గౌరవం

స్కోచ్ స్టార్ ఆఫ్ గవర్నెన్స్ పురస్కారానికి ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి శాఖకు మరో అరుదైన గౌరవం దక్కింది. గ్రామీణ పాలనలో అత్యుత్తమ విధానాలను అవలంబిస్తున్న రాష్ట్రంగా ప్రతిష్టాత్మక 'స్కోచ్ స్టేట్ ఆఫ్ గవర్నెన్స్ రిపోర్ట్-2021'లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. దీనిలో భాగంగా స్టార్ ఆఫ్ గవర్నెన్స్-స్కోచ్ అవార్డుకు ఆంధ్రప్రదేశ్ ఎంపికైనట్లు స్కోచ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ దీపక్ దలాల్ ప్రకటించారు. జూన్ 18వ తేదీన ఢిల్లీలో ఇండియన్ గవర్నెన్స్ ఫోరం అధ్వర్యంలో జరుగనున్న కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాల కృష్ణ ద్వివేదికి రాసిన లేఖలో ఆయన వెల్లడించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలు, విప్లవాత్మకమైన సంస్కరణల ఫలితంగానే జాతీయ స్థాయిలో ఏపీ గ్రామీణాభివృద్ధి శాఖకు అరుదైన గుర్తింపు లభించిందన్నారు. గ్రామీణ పాలనలో సీఎం జగన్ ముందుచూపుతో తీసుకువచ్చిన మార్పులు జాతీయస్థాయిలో చాలా రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలిచాయన్నారు. పారదర్శక పాలన, ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలను తీసుకువెళ్లడం వంటి అంశాలతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధిలో విజయవంతమైన ఫలితాలను సాధిస్తోందన్నారు. దానికి నిదర్శనమే తాజాగా స్టార్ ఆఫ్ గవర్నెన్స్ స్కోచ్ అవార్డుకు ఎంపికైందని వివరించారు. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, ఇతర అధికారులు, ఉద్యోగులను ఆయన అభినందించారు.

చలో అమలాపురానికి కాంగ్రెస్ పిలుపు

శైలజానాథ్‌తోపాటు నేతల అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి చలో అమలాపురానికి తరలి వెళ్లేందుకు ప్రయత్నించిన శైలజానాథ్‌తోపాటు విజయవాడ నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని, వారిని కృష్ణలంక పోలీసుస్టేషన్‌కు తరలించారు. శైలజానాథ్ మీడియాతో మాట్లాడుతూ, కోనసీమకు అంబేద్కర్ పేరును కొనసాగించాలని డిమాండు చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించడమంటే రాజ్యాంగాన్నీ, దేశ నాయకత్వాన్ని అవమానించడమేనని, కోనసీమలోని కులోన్మాదులు, మతోన్మాదులు అంబేద్కర్‌ను అవమానించారని మండిపడ్డారు. కుట్రలకు ఆస్కారం కలిగించేలా ప్రభుత్వం వ్యవహరించిందన్నారు. మంత్రి ఇంటిపై దాడి జరిగిన తీరు అనుమానాలకు తావిస్తోందన్నారు. మంత్రి ఇంటికే దిక్కు లేకపోతే ప్రభుత్వం ప్రజలకు ఏం రక్షణ కల్పిస్తుందని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ఈనెల 29వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కులోన్మాదులను, మతోన్మాదులను, రౌడీ షీటర్లను పోలీసులు పెంచి పోషిస్తున్నారన్నారు. శాంతియుతంగా ఆందోళనలు చేయాలే తప్ప, అమలాపురంలో అమాయకులైన ఎస్సీలు దెబ్బలు తింటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నంద్యాల జిల్లాకు 'ఉయ్యాలవాడ' పేరు పెట్టాలి

విశాలాంధ్ర-విజయవాడ: నంద్యాల జిల్లాకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టాలని దక్షిణ భారత ఉయ్యాలవాడ సేవ సమితి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి ప్రభుత్వానికి గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తొలి తెలుగు స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నంద్యాలలో జన్మించారని పేర్కొన్నారు. రాయలసీమలో బ్రిటిష్ వారిని ఎదిరించినందుకు ఆయన్ను ఉరి తీసి కోటగుమ్మానికి వేలాడదీశారన్నారు. గొప్ప యోధుడైన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరును నంద్యాల జిల్లాకు పెట్టాలని కోరారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఉయ్యాలవాడ పేరు పెట్టాలని 2017లోనే అప్పటి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. కనీసం ఇప్పుడు అయినా ఆ మహావీరుడి పేరు నంద్యాల జిల్లాకు పెట్టి గౌరవించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసినట్లు వివరించారు.

భువనేశ్వర్‌లోని టీటీడీ ఆలయ

'మహా సంప్రోక్షణ'లో గవర్నర్ విశ్వభూషణ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం గురువారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట, మహాసంప్రోక్షణ, ఆవాహన వంటి శుభ కార్యక్రమాలలో రాష్ట్ర గవర్నర్ విశ్వ భూషణ్ హరిచందన్ పాల్గొన్నారు. స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఇతర హిందూ మత పెద్దల సమక్షంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో స్వామివారికి కల్యాణోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, భువనేశ్వర్ ఎంపీ అపరాజిత సారంగి, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గవర్నర్‌ను టీటీడీ చైర్మన్ ఘనంగా సత్కరించారు.

కులాలమధ్య చిచ్చుకే బస్సుయాత్ర: జనసేన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏం సాధించారని మంత్రుల బృందం బస్సు యాత్రలు చేస్తోందంటూ జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేశ్ ప్రశ్నించారు. గురువారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ... కులాల మధ్య చిచ్చుపెట్టే ఉద్దేశంతో, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని ఉద్దేశపూర్వకంగానే వైసీపీ నాయకులు ఇలాంటి కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కడపకు అంబేద్కర్ పేరు పెట్టాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలను మోసం చేసిన ఏకైక పార్టీ వైసీపీ అని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలంతా గ్రహించారని, రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

సీబీఐ విచారణకు కార్తీ చిదంబరం

న్యూఢిల్లీ: వీసా కుంభకోణం కేసులో కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం గురువారం సీబీఐ విచారణకు హాజరయ్యారు. 2011లో తన తండ్రి పి.చిదంబరం హోంమంత్రిగా ఉన్నప్పుడు 263 మంది చైనీయులకు భారతీయ వీసాలను జారీ చేయించినట్లు కార్తీపై ఆరోపణలు ఉన్నాయి. బ్రిటన్, యూరప్ పర్యటనలో ఉన్న ఆయన తిరిగి వచ్చిన 16 గంటల్లోగా సీబీఐ విచారణకు హాజరు కావాలని ప్రత్యేక కోర్టు కార్తీకి ఇంతకుముందే ఆదేశాలు ఇచ్చింది. సుప్రీంకోర్టుతో పాటు ప్రత్యేక కోర్టు అనుమతితోనే ఆయన విదేశాలకు వెళ్లారు. బుధవారం తిరిగొచ్చిన కార్తీ గురువారం ఉదయం సీబీఐ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. అక్కడ విలేకరులతో మాట్లాడుతూ, ఇది బోగస్ కేసు అని, తాను చైనీయులకు వీసాలు జారీ చేయించలేదని చెప్పారు.వీసాల జారీ కోసం రూ.50లక్షల లంచాన్ని కార్తీతో పాటు ఆయన సన్నిహితుడు ఎస్ భాస్కరరామన్ పొందినట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

రక్తమోడిన రహదారులు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 12మంది దుర్మరణం

విశాలాంధ్ర-మోపిదేవి: రాష్ట్రంలో రహదారులు రక్తమోడాయి. వేర్వేరుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 12మంది మృత్యువాతపడ్డారు. గురువారం కృష్ణాజిల్లా మోపిదేవి మండలం కాసానగర్ వద్ద బొలెరో వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, 20 మందికి గాయాలయ్యాయి. ఇందులో 25మంది ప్రయాణిస్తున్నారు. వీరంతా చల్లపల్లి మండలం చింతమడ గ్రామం నుంచి మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామంలో జరుగుతున్న పెళ్లి వేడుకలో పాల్గొనేందుకు వెళుతుండగా కాసా నగరం మలుపు వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఒకరు మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందారు. మృతులను కోన వెంకటేశ్ (68), గుర్వేపల్లి కోటేశ్వరమ్మ (55), గుర్వేపల్లి రమణ (45), గుర్రం విజయ (50), ఎం.మాధవ రావు(65)గా గుర్తించారు. చల్లపల్లి ఎస్ఐ సందీప్ ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చల్లపల్లి, అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి పంపారు. స్థానిక శాసనసభ్యుడు సింహాద్రి రమేష్ బాబు ప్రమాదంలో గాయపడ్డ వారిని పరామర్శించారు. కాగా అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం వల్లే ప్రమాదం సంభవించినట్లు డిఎస్పీ మహబూబ్‌బాషా తెలిపారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

ఒకే కుటుంబంలో నలుగురి మృతి

విశాలాంధ్ర-మదనపల్లె: అన్నమయ్య జిల్లాలో కారు కల్వర్టును ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతి చెందారు. మదనపల్లి నియోజకవర్గం, వలసపల్లె పంచాయతీ 150వ మైలు వద్ద ఈ ఘటన జరిగింది. నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లెకు చెందిన గంగిరెడ్డి కుటుంబం ప్రయాణిస్తున్న కారు కల్వర్టును ఢీకొని అదుపు తప్పి నీటిలో పడిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ గమనించకపోవడంతో కారులో ప్రయాణిస్తున్న వారు వాహనంలోనే తీవ్రగాయాలతో ప్రాణాలు విడిచారు. ఉదయం 6.30 గంటల ప్రాంతంలో బహిర్భూమికి వెళ్లిన స్థానికులు కల్వర్టును ఢీకొన్న చోట కారు విడిభాగాలు, అద్దాలు పగిలి ఉండటంతో అనుమానం వచ్చి కల్వర్టు కింద చూడగా చెరువు నీటిలో కారు పైకి కొద్దిగా కనిపించింది. అక్కడి నీరు ఎర్రగా మారిఉండటం చూసి ప్రమాదమేదో జరిగిందని భావించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు చెరువులోంచి మృతదేహాలను వెలికితీశారు. వీరిని రెడ్డివారిపల్లెకు చెందిన నీలపరెడ్డిగారి మనోహర్ రెడ్డి కుమారుడు గంగిరెడ్డి(40), కోడలు మధుప్రియ(28), మనుమడు దేవాన్ష్ రెడ్డి(3), మనవరాలు ఖుషితారెడ్డి(5)గా గుర్తించారు. నీటమునిగిన కారును క్రేన్ సహాయంతో చెరువులో నుంచి వెలుపలికి తీసిన పోలీసులు మృతదేహాలను పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సామాజిక విప్లవం జగన్‌కే సాధ్యం

'సామాజిక న్యాయ భేరి'లో మంత్రుల ఉద్ఘాటన

విశాలాంధ్ర-శ్రీకాకుళం: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 'సామాజిక న్యాయ భేరి' బస్సు యాత్ర గురువారం శ్రీకాకుళం నుంచి మొదలైంది. యాత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 17 మంది మంత్రులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్ వల్లే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రాష్ట్రంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యాపరంగా సామాజిక న్యాయం జరుగుతుందని, దేశానికే ఇది మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు. తొలుత శ్రీకాకుళం నగరంలోని వైఎస్ఆర్ కూడలి (ఏడురోడ్ల జంక్షన్) వద్ద డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి మంత్రులు, పార్టీ నేతలు నివాళులు అర్పించారు. రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి. ఉషా శ్రీచరణ్, హోంమంత్రి తానేటి వనిత, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలతోపాటు, మిగతా పేద వర్గాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్ పరిపాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని, ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీ వర్గాలు ముఖ్యమంత్రికి అండగా ఉంటున్నారని చెప్పారు. సీఎం జగన్ ఆలోచనలను ప్రజలకు వివరిచేందుకు ఈ బస్సుయాత్ర సాగుతోందని చెప్పారు. అందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. బాదుడే బాదుడు అంటూ చంద్రబాబు నాయుడు రాష్ట్రమంతా తిరిగారే కానీ ఏ ఒక్క ప్రభుత్వ కార్యక్రమంలో ఒక్క రూపాయి అవినీతి జరుగుతోందని చెప్పలేకపోయారన్నారు. రాష్ట్రంలో సామాజిక విప్లవం జగన్ తోనే మొదలైందని, ఇది చంద్రబాబుకు కనిపించలేదా? అని ప్రశ్నించారు. యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన నాలుగు బహిరంగ సభల్లో ప్రభుత్వం సాధించిన విజయాలు, తీసుకువచ్చిన మార్పులు, ఖర్చు పెట్టిన మొత్తాలు, లబ్ధిపొందిన వర్గాల గురించి వివరిస్తామన్నారు. దేశంలో ఇలాంటి స్ఫూర్తి ఎక్కడా కనపడటం లేదని, మరోవైపు స్త్రీ సమానత్వంపై కూడా పెద్ద ఎత్తున ప్రయోజనాలు కల్పించిన ఘనత వైసీపీ పభుత్వానిదేనన్నారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించిన ప్రభుత్వం ఇది... ఆర్థిక సమానత్వం వచ్చినరోజే సామాజిక సమానత్వం వస్తుందనే భావనతో వాళ్లందరికీ నామినేటెడ్ పదవులు, పనుల్లో రిజర్వేషన్ జగన్ కల్పించారు. విద్యా, వ్యవసాయ రంగాల్లో కొత్త సంస్కరణలు తీసుకువచ్చి అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ స్ఫూర్తిని ప్రజలందరికీ తెలియజేసేందుకు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టేందుకు మంత్రివర్గంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మంత్రులంతా ఒక కూటమిగా, ఉద్యమంగా, సామాజిక విప్లవం మాదిరి బస్సుయాత్రను మొదలుపెడుతున్నట్లు పేర్కొన్నారు.

వైద్యసేవలు పటిష్ఠం

వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు పటిష్ఠవంతంగా అమలుకు కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఆదేశించారు. ఏపీ సచివాలయంలోని తన ఛాంబర్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. కృష్ణబాబు మాట్లాడుతూ, ఆస్పత్రుల్లో మందులు, మహాప్రస్థానం వాహనాలు, శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్, వాక్సినేషన్, బయోమెట్రిక్ హాజరు, జిల్లాల్లో కింది స్థాయి సిబ్బంది నియామకం, కరోనా ఎక్స్‌గ్రేషియా తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. అత్యవసర మందుల లభ్యత, అదనంగా కావాల్సిన మందుల గురించి సమాచారం అడిగి తెలుసుకున్నారు. అదనంగా కావాల్సిన మహాప్రస్థానం వాహనాలపై సీఎంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. రుయా ఘటన నేపథ్యంలో ఆర్డీవో, డీఎస్పీలతో కూడిన కమిటీలు తగిన నిర్ణయాలు తీసుకుంటాయని చెప్పారు. ప్రైవేట్ వాహనాల మాఫియాను అడ్డుకోవాలన్నారు. వాహనాల రేట్లను అందరికీ తెలిసేలా బోర్డులు పెట్టారా? లేదా? అనే విషయాన్ని ఆర్డీవో, డీఎస్పీలు ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలన్నారు. కలెక్టర్లు ఆకస్మిక తనిఖీచేస్తే వాస్తవ పరిస్థితులు తెలుస్తాయని సూచించారు. వెనుకబడిన జిల్లాలు లక్ష్యాన్ని పూర్తి చేయాలని, ప్రికాషనరీ డోస్ విషయంలోనూ అశ్రద్ధ వహించొద్దని చెప్పారు. ఉద్యోగులందరికీ బయోమెట్రిక్ విధానం పూర్తిస్థాయిలో అమలయ్యేలా హాజరు నమోదు అంశాలను వైద్యాధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రతి ఉద్యోగి నిర్ణీత సమయానికి ఆసుపత్రిలో ఉండాల్సిందేనని, మందుల కొనుగోలుకు రూ.650 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆస్పత్రుల్లో కింది స్థాయి సిబ్బంది నియామకాల్లో నిబంధనల్ని సడలిస్తామని, ఆరోగ్యశ్రీ నిధుల్ని వేరే అవసరాలకు వినియోగించవద్దని చెప్పారు. దావోస్‌లో సీఎం జగన్ సందేశం ఎంతో స్ఫూర్తినిచ్చిందన్నారు. వీడియో సమావేశంలో కృష్ణబాబుతో పాటు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జే.నివాస్ పాల్గొన్నారు.

రెండు మూడు నెలల్లోనే సంచలన వార్త : సీఎం కేసీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: రెండు మూడు నెలల్లో తాను సంచలన వార్త చెప్పనునట్లు సీఎం కేసీఆర్ అన్నారు. ఎన్నో పార్టీలు దేశాన్ని పాలించినా ఆశించిన మార్పు జరగలేదని పేర్కొన్నారు. గురువారం బెంగుళూరు పర్యటనలో భాగంగా మాజీ ప్రధాని దేవెగౌడ, కర్ణాటక మాజీ జీఎం కుమారస్వామితో భేటీ అయ్యారు. వీరి మధ్య దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులతో పాటు రాజకీయ అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్టు తెలుస్తోంది. అనంతరం సీఎం కేసీఆర్, మాజీ సీఎం కుమారస్వామి కలిసి విలేకరులతో మాట్లాడారు. దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని త్వరలోనే కేంద్రంలో మార్పు వస్తుందని చెప్పారు. ఈ మార్పును ఎవ్వరు అడ్డుకోలేరని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాల గడుస్తున్నా ప్రజల స్థితిగతులో మార్పులేదన్నారు. ఎక్కడ వేసిన గొంగళి ఎమ అక్కడే వుండిపోయిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. భారత్ కంటే తక్కువ జీడీపీ వున్న చైనా ఇప్పుడు ఆర్థికంగా ప్రపంచాన్ని శాసిస్తోందన్నారు. మోదీ ప్రభుత్వం మాత్రం 5 ట్రిలియన్ డాలర్ల బిజినెస్ అంటూ ప్రచారం చేస్తోందని, ఇది దేశానికే అవమానమని అన్నారు. ఒకవైపు అమృతోత్సవాలను జరుపుకుంటూ విద్యుత్తు, మంచినీరు, సాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని మోదీకి పాలనపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. మోదీ పాలనలో ఏవర్గమూ సంతోషంగా లేదని విమర్శించారు. రానున్న కాలంలో ఎవరు అధికారంలోకి వస్తారనేది అనేది ముఖ్యం కాదని, అయితే ఉజ్వల భవిష్యత్తు వైపు అడుగులు పడతాయని మాత్రం చెప్పగలనని వ్యాఖ్యానించారు.

30న కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు

జయప్రదం చేయండి

చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర నేతలు చలపతి, రామాంజనేయులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పెట్రోల్, డీజిల్,గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, అర్హులైన పేదలకు ప్రజాపంపిణీ ద్వారా ఆహార ధాన్యాలు ఉచితంగా అందించాలని,రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్, ఆర్టీసీ, ఆస్తి, చెత్త పై పన్నులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30వ తేదీ వామ పక్షాల ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలను జయప్రదం చేయాలని చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జింకా చలపతి, కె.రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.తాము అధికారంలోకి వస్తే మంచి రోజులు వస్తాయని మోసం చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ, అసలే కరోనాతో ఆర్థికంగా చితికి పోయి ప్రజలు అల్లాడుతుంటే భారతదేశ చరిత్రలోనే 16 రోజుల్లో 14 రోజుల పాటు ప్రతి రోజు పెట్రోల్,డీజిల్ ధరలు పెంచి చరిత్ర సృష్టించిందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చే ముందు 400/రూ.లు ఉన్న వంట గ్యాస్‌ను ఏడేళ్ళలో రూ.1100/లకు పెంచింది. ఇక నిత్యావసర వస్తువుల ధరలపై నియంత్రణే లేదు. పెరిగిన ధరల వల్ల అన్ని వర్గాల ప్రజలతో పాటు చేతి వృత్తి దారులపై ప్రత్యక్షంగా, పరోక్షంగా పెనుభారం పడుతుంది. అందుకే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన ధరలు,పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ 30న జరిగే ధర్నా కార్యక్రమాల్లో చేతి వృత్తిదారులు పెద్దసంఖ్యలో పాల్గొని నిరసన తెలియజేయాలని వారు కోరారు.

ఉద్యోగ అర్జీదారునికి ఆ హక్కు లేదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మొదలు పెట్టిన నియామక ప్రక్రియను ముగించాల్సిందిగా కోరే హక్కు ఉద్యోగ అర్జీదారునికి ఉండదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. అభ్యర్థి ఎంపికైనాగానీ నియామక ప్రక్రియ గురించి మాట్లాడే హక్కు ఉండబోదని జస్టిస్ కేఎం జోసఫ్, జస్టిస్ రిషికేశ్ రాయ్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 2018, మార్చి 1న జారీ అయిన ప్రకటన క్రమంలో ఆన్‌లైన్ ద్వారా ఈఎస్ఐసీ ఆధ్వర్యంలోని కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న వారి కేసును కోర్టు విచారించింది. ఆ ప్రకటన ప్రకారం అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టును భర్తీ చేయాలని కేంద్ర ట్రిబ్యునల్‌ను ఓ అభ్యర్థి ఆశ్రయించగా ఆయనకు అనుకూలంగా తీర్పు వెలువడింది. అయితే ఈ తీర్పును కర్ణాటక హైకోర్టులో సవాల్ చేయగా రిట్ పిటిషన్ తిరస్కరణకు గురైంది. 45 రోజుల్లోగా నియామక ప్రక్రియను పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది. హైకోర్టు తీరును సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ తగు నిర్ణయానికి రావాలని అప్పిలేంట్లకు రెండు నెలల గడువిస్తూ ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసింది.

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా వినయ్ కుమార్ సక్సేనా ప్రమాణం

న్యూఢిల్లీ: ఢిల్లీ 22వ లెఫ్టినెంట్ గవర్నర్‌గా వినయ్ కుమార్ సక్సేనా ప్రమాణం చేశారు. గురువారం నగరంలోని రాజ్ నివాస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విపిన్ సంఘీ ఆయన చేత ప్రమాణం చేయించారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ సహా ఎంపీలు, రాష్ట్ర మంత్రులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ప్రమాణం చేసిన వినయ్ కుమార్ సక్సేనా మాట్లాడుతూ తాను రాష్ట్రానికి ఎల్‌జీగా కాకుండా స్థానిక ప్రజలకు సంరక్షకుడిగా పని చేస్తానని చెప్పారు. రాజ్ నివాస్‌లో ఉండడం కన్నా నగరం రోడ్లపైనే ఎక్కువ సమయం ఉంటానన్నారు. సీఎం కేజ్రీవాల్ మాట్లాడుతూ మాజీ ఎల్‌జీ అనిల్ బైజల్‌తో పని చేసినట్టే సక్సేనాతోనూ తమ ప్రభుత్వం కలసిపని చేస్తుందని తెలిపారు. వ్యక్తిగత కారణాలతో ఢిల్లీ ఎల్‌జీగా వ్యవహరించిన అనిల్ బైజల్ ఈ నెల 18న రాజీనామా చేయడంతో కేవీఐసీ చైర్మన్‌గా పని చేసిన వినయ్ కుమార్ సక్సేనాను ఎల్‌జీగా నియమిస్తూ రాష్ట్రపతి ఈ నెల 23న ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే.

ప్రిన్సిపాల్ కుర్చీలో కూర్చొని వివాదంలో చిక్కుకున్న టీఎంసీ ఎమ్మెల్యే

కోల్‌కతా: ప్రభుత్వ కళాశాలను సందర్శించిన అధికార పార్టీ ఎమ్మెల్యే విజ్ఞత మరచి ప్రిన్సిపాల్ కుర్చీలో కూర్చోవడం వివాదాస్పదం అయింది. పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలోని శాంతపూర్‌లోని ఒక కళాశాలను సందర్శించిన అధికార టీఎంసీ ఎమ్మెల్యే బ్రజా కిషోర్ గోస్వామి ఏకంగా ఆకళాశాల ప్రిన్సిపాల్ కూర్చునే స్థానంలో కూర్చున ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఎమ్మెల్యే చర్యపై అన్ని వైపుల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనపై ప్రతిపక్ష బీజేపీ ఘాటుగా స్పందించింది. ఇది రాష్ట్రంలోని విద్యావ్యవస్థ దుస్థితి అంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ వ్యాఖ్యానించారు. ఒక ఎమ్మెల్యే ముందు విద్యావ్యవస్థ అంతా తలవంచాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ విమర్శించారు, టీఎంసీ విద్యావిధానం ఇదేనంటూ ఎద్దేవా చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన ఎమ్మెల్యే బ్రజా కిషోర్ గోస్వామి విలేకరులతో మాట్లాడుతూ తాను ఇటీవల శాంతిపూర్ కళాశాలను సందర్శించానని, ఆ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రిమా భట్టాచార్య తన కుర్చీలో కూర్చోమని అభ్యర్థించి ఆమె పక్కనున్న సోఫాలో కూర్చున్నారని వివరణ ఇచ్చారు. ఇందులో తప్పులేకపోయినా కావాలనే ఎవరో తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

ఇంటికెళ్లి వంట చేసుకో...

ఎన్సీపీ ఎంపీపై బీజేపీ నేత అనుచిత వ్యాఖ్య

ముంబై: బీజేపీ మహారాష్ట్ర అధ్యక్షుడు చంద్రకాంత్ పాటిల్ ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలేపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. మీకు రాజకీయాలు అర్థం కాకుంటే, ఇంటికి వెళ్లి వంటచేసుకోవాలని ఆమెను ఉద్దేశిస్తూ పాటిల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో ఉద్యోగాలు, విద్యాలయాల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ, ఎన్సీపీ మధ్య మాటలయుద్ధం సాగింది. మధ్యప్రదేశ్‌లో ఓబీసీ కోటా అమలుకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, ఆ రాష్ట్ర సీఎం ఢిల్లీకి వచ్చి, అక్కడ ఎవర్నో కలిశారని, ఆ మరుసటి రెండు రోజులకు ఓబీసీ రిజర్వేషన్లకు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు సుప్రియా సూలే ఓ కార్యక్రమంలో వ్యాఖ్యానించారు.ఆ వ్యాఖ్యలపై చంద్రకాంత్ స్పందిస్తూ, సుప్రియాకు రాజకీయాలు తెలియవని, ఇంటికివెళ్లి వంట చేసుకోవాలని, సీఎంను ఎలా కలువాలో కూడా ఆమెకు తెలియదని వ్యాఖ్యానించారు. బీజేపీ నేత చంద్రకాంత్ స్త్రీ ద్వేషి అని సుప్రియా భర్త సదానంద సూలే తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. తన భార్య పట్ల తనకు గౌరవం ఉందని, ఆమె ఇంట్లో పనిచేస్తుందని, తల్లి అని, ఓ విజయవంతమైన రాజకీయవేత్త అని సదానంద అన్నారు. చంద్రకాంత్ వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ మంత్రి నకుల్ దూబే

న్యూఢిల్లీ: యూపీ ఎన్నికలు పూర్తయ్యాక బీఎస్పీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీలో కీలకనేతగా ఉన్న బీఎస్పీ నేత, మాజీ మంత్రి నకుల్ దూబే గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బహుజన్ సమాజ్ పార్టీలో బ్రాహ్మణ సామాజికవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన నకుల్ దూబె 2007లో మాయావతి నేతృత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారు. బ్రాహ్మణులు దళితులను ఒకే వేదికపైకి తెచ్చి పాలనాపగ్గాలు మాయావతికి అందించడంలో ప్రముఖ పాత్ర వహించారు. కొద్ది రోజుల కిందట ఢిల్లీలో యూపీ ఇంఛార్జి ప్రియాంక గాంధీతో బేటీ అయిన దూబె తాజాగా బీఎస్పీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అధికార పార్టీకి ప్రత్యామ్నాయం కాంగ్రెస్ పార్టీ అని భావించి తాను అందులో చేరినట్టు తెలిపారు.

In The Court of the 6th
Addl.Junior Civil Judge Cum Special Excise And Prohibition: Kakinada
OS No.634 of 2020
Between:
ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి ...... వాది
మరియు
తుంగల వెంకట కృష్ణ ...... ప్రతివాది
ప్రతివాది అడ్రస్:
తుంగల వెంకట కృష్ణ S/o.పూర్ణచంద్రరావు, Asst. సాంఘిక సంక్షేమ అధికారి, డోర్ నెం.56-6-5/బి, రామినేని వారి వీధి, పంట కాలువ రోడ్, పటమట, విజయవాడ, కృష్ణా జిల్లా.
దావా నోటీసు:
పై నెంబరు దావాలో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపించినప్పటికీ పుచ్చుకోకుండా Evade చేయుచున్నందున పై నెంబర్ దావా దిది: 27-06-2022 తేదీ నాటికి వాయిదా అయినందున సదరు తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు స్వయంగా కానీ మీ న్యాయవాది ద్వారా కానీ కోర్టుకి హాజరు కావలెను. లేనిచో మీ పరోక్షమునందు విచారణ జరుపబడును అని ఇందుమూలముగా తెలియజేయడం అయినది.
N.Nagababu, Advocate,
Postal Colony, Shanthi Nagar, Kakinada
Dt.26-05-2022
Kakinada Cell: 90525 25248

శుక్రవారం
27-05-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 333
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం



కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు షాక్

- పది నెలలే విధుల పొడిగింపు
- ఇంటర్మీడియట్ కమిషనర్ నుంచి ఉత్తర్వులు
- 12 నెలల ఆనవాయితీకి స్వస్తి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:
జూనియర్ కళాశాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఏటా 12 నెలల(పది రోజులు తక్కువతో)పాటు వారి విధులను పొడిగించే ఆనవాయితీ ఉండగా, రాబోయే (2022-23) విద్యా సంవత్సరానికి వైసీపీ ప్రభుత్వం పది నెలలకే పొడిగించింది. రాష్ట్రంలోని 3618 మంది కాంట్రాక్టు లెక్చరర్ల విధులను ఏప్రిల్ 01, 2022 నుంచి పది నెలలపాటు పొడిగిస్తూ ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఎంవీ శేషగిరిబాబు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని కాంట్రాక్టు లెక్చరర్లు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. తమ సర్వీసులు క్రమబద్ధీకరణ కాకుండా సాంకేతిక సమస్యలు తలెత్తాలనే ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరిస్తోందని మండిపడుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి నుంచి కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లు సేవలు అందిస్తున్నారు. వీరంతా పేరుకు కాంట్రాక్టు లెక్చరర్లయినా, ప్రభుత్వం రెగ్యులర్ వారితో సమానంగా పని చేయిస్తోంది. ఇంటర్మీడియట్ స్పాట్ వ్యాల్యుయేషన్ నుంచి ఇతరత్రా అన్ని కార్యక్రమాల్లోనూ భాగస్వాములవుతున్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్ల సమస్యల - మిగతా 5 లో

లాభాలొచ్చినా తప్పని 'ప్రైవేట్'

- బొగ్గు గనులను అమ్మకానికి పెట్టేస్తున్న కేంద్రం
- కోల్ ఇండియా భవిష్యత్ ప్రశ్నార్థకం
- సంస్థ నికర లాభంలో 46 శాతం వృద్ధి
- నాల్గో త్రైమాసిక ఫలితాల్లో వెల్లడి

న్యూఢిల్లీ :
ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రైవేటుకు అప్పగించేందుకు కేంద్రం కంకణం కట్టుకుంది. వరుసబెట్టి బ్యాంకులు, పరిశ్రమలు, బొగ్గు-ఖనిజ గనులనూ ప్రైవేటీకరిస్తోంది. లాభాలు వచ్చే సంస్థలను సైతం పెట్టుబడులను ఉపసంహరించుకొని ప్రైవేటీకరణ కోసం పరుగు పెట్టిస్తోంది. ఇటీవల దాదాపు 186 బొగ్గు-ఖనిజ గనులను వేలానికి పెట్టింది. అందులో చాలా వరకు అమ్ముడుపోగా మిగతా వాటికి టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవలి హిందుస్థాన్ జింగ్ లిమిటెడ్ వాటాలనూ విక్రయించేసి తద్వారా రూ.37వేల కోట్లను ఆర్జించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఎయిర్ ఇండియా, ఎల్ఐసీ వంటి కీలక సంస్థలను ప్రైవేటుకు అప్పగించింది. ఇలాంటి పరిస్థితుల్లో కోల్ ఇండియా భవిష్యత్ ప్రశ్నార్థకంగా తోస్తోంది. లాభాలొచ్చే ఈ - మిగతా 5 లో

ఆకర్షణ అరకొరే !

- ఫలితమివ్వని వరుస భేటీలు
- ఎంవోయూల కంటే హామీలే ఎక్కువ
- అవి కూడా పూర్వపు వాగ్దానాలే
- ముగిసిన సీఎం జగన్ దావోస్ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
పెట్టుబడులను ఆకర్షించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన దావోస్ పర్యటన ఆశించిన ఫలితాలివ్వలేదు. ఈనెల 22వ తేదీ నుంచి 26వరకు దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరంకు సీఎంతో పాటు, పరిశ్రమలశాఖమంత్రి అమరనాథ్, అధికారుల బృందం హాజరైంది. ఐదు రోజులపాటు జరిగిన ఈ సదస్సులో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ బృందం అరకొర పెట్టుబడులు, నామమాత్రపు ఎంవోయూలు, కొద్దిపాటి హామీలతోనే వెనుతిరగాల్సి వచ్చింది. ఆ సదస్సులో పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకుగాను 'పీపుల్-ప్రోగ్రెస్-పాజిబిలిటీస్' నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ఏపీ పెవిలియన్ ఏర్పాటు చేసింది. ఈ వేదికగా ఏపీకున్న ప్రకృతి వనరులను, ఇతర అనుకూల అంశాలను, ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు తీసుకుంటున్న ప్రోత్సాహక చర్యలను సీఎం బృందం వివరించింది. కాని అవేమీ పారిశ్రామికవేత్తలను పెద్దగా ఆకట్టుకోలేకపోయాయి. అసలు పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలకు ఏం అవసరమో, ఆయా అంశాలపై వారికి స్పష్టత ఇవ్వకుండా, రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తుందో వివరించడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. అందువల్లే కొత్తగా పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలెవ్వరూ ముందుకు రాలేదు. అదానీ, అరబిందో, గ్రీన్‌కోలతో జరిగిన ఎంవోయూలు కూడా గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన హామీలు కావడం గమనార్హం. ఇక దావోస్ బృందం అధికారికంగా ప్రకటించిన ఎంవోయూలను పరిశీలిస్తే...నాలుగోతరం పారిశ్రామికీకరణకు మూలకేంద్రంగా రాష్ట్రాన్ని మార్చేందుకు అవసరమైన గ్రీన్ ఎనర్జీకి సంబంధించి రూ.1.25కోట్ల పెట్టుబడులపై అదానీ, గ్రీన్‌కో, అరబిందోలతో ఒప్పందం కుదుర్చుకుంది. దీనివల్ల పంప్డ్ స్టోరేజీ లాంటి వినూత్న విధానాలతో మొత్తంగా 27,700 మెగావాట్ల క్లీన్ ఎనర్జీ రాష్ట్రంలోకి అందుబాటులోకి రాబోతోందని సీఎం సమక్షంలో సంస్థ సీఈఓ ఆదిత్య మిట్టల్ ప్రకటన చేశారు. అలాగే గ్రీన్ ఎనర్జీని వినియోగించుకుని పారిశ్రామిక ఉత్పత్తులు దిశగా మచిలీపట్నంలో ఒక ఎస్ఈజెడ్‌ను తీసుకువచ్చేందుకు ఏస్ అర్బన్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఒప్పందం చేసుకుంది. గ్రీన్ ఎనర్జీని వినియోగించుకోవడంతోపాటు, అత్యాధునిక పద్ధతుల్లో ఉత్పత్తులు సాధించేందుకు వీలుగా ఈ జోన్‌ను అభివృద్ధిచేస్తారు. కాలుష్యాన్ని తగ్గించుకోవడం, పర్యావరణ సమతుల్యతకు పెద్దపీట వేయడం, గ్రీన్ ఎనర్జీని వినియోగించుకోవడం, నాణ్యత పెంచుకోవడం, టెక్నాలజీకి పెద్దపీట వేస్తూ ప్రపంచస్థాయి ఉత్పత్తులు సాధించేలా పరిశ్రమలకు తోడుగా నిలవడానికి అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ దిశగా రాష్ట్ర ప్రభుత్వం డబ్ల్యూఈఎఫ్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం డబ్ల్యూఈఎఫ్ నిర్వహించే అనేక కార్యక్రమాలు, ప్రాజెక్టులతో రాష్ట్రానికి అనుసంధానం ఏర్పడుతుంది. రాష్ట్రంలోని పారిశ్రామిక రంగానికి అత్యాధునికతను, కాలుష్యంలేని విధానాలను జోడించడానికి డబ్ల్యూఈఎఫ్ తగిన సహకారాన్ని అందిస్తుంది. సముద్ర మార్గం ద్వారా రవాణాను మూడు రెట్లు పెంచే ఉద్దేశంతో ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ పాలసీ తెచ్చినట్లు సీఎం వివరించగా, తాము త్వరలో కాకినాడలో కార్యకలాపాలు ప్రారంభిస్తున్నట్లు మిట్సుయి ఒ.ఎస్.కె.లైన్స్ లిమిటెడ్ ప్రెసిడెంట్, సీఈఓ తకీషి హాషిమొటో ప్రకటించారు. హై ఎండ్ టెక్నాలజీ వేదికగా విశాఖపట్నాన్ని తీర్చిదిద్దుతున్నామని, ఈ రంగంలో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని కోరగా, ఆంధ్ర విశ్వవిద్యాలయంతో కలిసి హై ఎండ్ టెక్నాలజీపై పాఠ్యప్రణాళిక రూపకల్పనలో భాగస్వామ్యానికి టెక్ మహీంద్ర అంగీకారం తెలిపింది. వివిధ యూనికార్న్ స్టార్టప్స్ - మిగతా 5 లో

నిజాంను మించిన నియంత మోదీ

సీపీఐ కార్యదర్శి నారాయణ

8లో

మోదీ పర్యటనకు కేసీఆర్ మరోసారి డుమ్మా

తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మరోమారు ప్రధాని నరేంద్రమోదీ పర్యటనలో పాల్గొనకుండా డుమ్మా కొట్టారు.

8లో

సమాజ రుగ్మతలను పారద్రోలడంలో
కళల పాత్ర నిరుపమానం

- కడప సభలో వక్తల ఉద్ఘాటన
- ప్రజానాట్యమండలి రాష్ట్ర 10వ మహాసభలు ప్రారంభం
- భారీ ర్యాలీతో ఆకట్టుకున్న కళాకారులు

అభివాదం చేస్తున్న గని, నల్లూరి, ఓబులేశు, మాదాల రవి, కత్తి నరసింహారెడ్డి, చంద్రానాయక్, పీజే చంద్రశేఖర్, బాబ్జీ తదితరులు

విశాలాంధ్ర బ్యూరో–కడప:
ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర 10వ మహాసభలు గురువారం కడపలో ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కళాకారులు పెద్ద ఎత్తున ఈ ఉత్సవాలకు తరలివచ్చారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు గని, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు, ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్, సినీ నటుడు మాదాల రవి, దర్శకుడు బాబ్జీ బహిరంగ సభలో ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), ప్రధాన కార్యదర్శి పి.చంద్రానాయక్ పాల్గొన్నారు.
తొలుత కళాకారులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జెడ్పీ సమావేశ మందిరం (కమ్ముసాహెబ్, శ్యామలదేవి ప్రాంగణం) నుంచి ప్రారంభమైన ర్యాలీ కోటిరెడ్డి సర్కిల్, ఏడురోడ్ల కూడలి, గోకుల్‌లాడ్జి ప్రాంతాల మీదుగా కళాక్షేత్రం (మాదాల రంగారావు కళా ప్రాంగణం)కు చేరుకుంది. అక్కడ జరిగిన సభలో ఓబులేశు మాట్లాడుతూ... స్వాతంత్ర్య పోరాటం మొదలుకొని అనేక సామాజిక రుగ్మతలను పారదోలడానికి కళలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. కళాకారులైన కమ్ము సాహెబ్, శ్యామల దేవి సామాజిక రుగ్మతలపై అనేక కళా రూపాలను ప్రదర్శించి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. విప్లవ కవి మాదాల రంగారావు తన జీవితాన్ని ప్రజానాట్య మండలికి, కళలకు, కళాకారులకు అంకితం చేసిన గొప్ప వ్యక్తి కనుక ఆయన పేరున మనం మాదాల రంగారావు కళా ప్రాంగణంగా ఏర్పాటు చేసుకున్నామన్నారు. సంగీతానికి రాళ్లు కరిగినట్లే సమాజంలో మార్పుకు కృషి జరిగిందన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలను క్రోడీకరిస్తూ పదునైన కళారూపాలతో సమాజంలో మార్పు తీసుకువచ్చే శక్తి కళాకారులకే ఉందన్నారు. ఇప్పుడున్న పాలకులు స్వార్థంతో దేశాన్ని, రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. అలాంటి రుగ్మతలను దూరం చేయడానికి ఈ కళా ప్రదర్శనలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. కులమత విద్వేషాలను రెచ్చగొడుతూ పాలకులు అంబేద్కర్ పేరును కూడా జిల్లాకు పెట్టనీయకుండా నీచరాజకీయాలు చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ సమాజానికి కళలు ఆలోచింపచేసే విధంగా ఉంటాయనీ, కళాకారులు కళలను ఆస్వాదించినట్లయితే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. మంచి ఆలోచనలకు కళలు ఎంతో దోహదపడతాయని ప్రజలను ఆకర్షించడానికి ఉద్యమాలను ముందుకు తీసుకుపోవడానికి సౌకర్యవంతంగా ఉంటాయన్నారు. ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో 1948వ సంవత్సరంలో దున్నేవాడిదే భూమి ముందుకు వచ్చిందన్నారు. కుల వివక్షతను నిర్మూలించడంలో సామాజిక, సాంఘిక రుగ్మతల నుంచి బయట వేయడానికి ప్రజానాట్య మండలి కళాకారులు ఎనలేని కృషి - మిగతా 5 లో

ధరలు తగ్గించాల్సిందే

మంగళగిరిలో పెట్రోల్ బంక్ వద్ద కరపత్రాలు పంచుతున్న ముప్పాళ్ల, జంగాల, చినతిరుపతయ్య, జాన్‌బాబు. బ్రహ్మేశ్వరరావు తదితరులు

- రెండో రోజూ వామపక్షాల ప్రచారాందోళన
- పెట్రోల్, డీజిల్‌పై సెస్సులు రద్దు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వం కూడా పన్నులు తగ్గించాలి
- 30న ధర్నా జయప్రదానికి కరపత్రాల పంపిణి

విశాలాంధ్ర–నెట్‌వర్క్ :
ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా వామపక్షాలు చేపట్టిన ప్రచారాందోళన గురువారం రెండో రోజుకు చేరింది. ఇందులో భాగంగా పెట్రోల్ బంకులు, ముఖ్య కూడళ్ల వద్ద ప్లకార్డులు ప్రదర్శించి పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ఇతర నిత్యావసర వస్తువుల ధరల పెంపును నిరసించారు. 30వ తేదీన కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరుతూ పెట్రోల్ పోయించుకునేందుకు వచ్చిన వారికి కరపత్రాలు పంపిణీచేశారు. అధిక ధరలు, పన్నులు, విద్యుత్, ఆర్టీసీ చార్జీలు ఇతర భారాలపై ప్రజలకు వామపక్షాల కార్యకర్తలు వివరించారు.
పెట్రోల్, డీజల్, గ్యాస్ ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా గుంటూరు జిల్లా మంగళగిరిలో పెట్రోల్ బంక్‌ల వద్ద సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నియోజకవర్గ సీపీఐ నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం - మిగతా 5 లో

ఇదీ లోకం!

కుటుంబపాలనతో తెలంగాణ నాశనం

ప్రధాని మోదీ

విశాలాంధ్ర–హైదరాబాద్:
కుటుంబపాలన ప్రజాస్వామ్యానికే ప్రమాదం అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. ముఖ్యంగా కుటుంబ పార్టీలు, కుటుంబ పాలన కారణంగా దేశంలో అవినీతి పెచ్చరిల్లుతుందని, ఇలాంటి వాటికి ప్రజల చరమగీతం పడాల్సిన అవసరం వుందని అయన పిలుపునిచ్చారు. బేగంపేట ఎయిర్‌పోర్టులో బీజేపీ కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. గతంలో ఎప్పుడు లేని విధంగా పరోక్షంగా కేసీఆర్ కుటుంబం పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఓ కుటుంబం నాశనం చేయాలని చూస్తోందని, ఆ కుటుంబం కేవలం తమ ఆస్తులను పెంచుకోడానికి మాత్రమే పనిచేస్తుందని, రాష్ట్రాభివృద్ధిని ఆ కుటుంబం అణిచివేయాలని చూస్తోందని విమర్శించారు. అయితే ఆ కుటుంబం కోసం తెలంగాణ ఉద్యమం జరగలేదన్న విషయం వారు గుర్తిస్తే మంచిదన్నారు. తెలంగాణలో మూఢనమ్మకాల పేరుతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలకు నిధులు సమకూరుస్తున్నప్పటికీ ఇక్కడి ప్రభుత్వం వాటి పేర్లుమార్చి తామే అమలు చేస్తున్నట్లు చెప్పుకోవడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆశయాలు నేటికి నెరవేరలేదని, మేము తగ్గేవాళ్ళం కాదు నెగ్గేవాళ్ళం అనే విషయాన్ని కుటుంబ పాలన సాగిస్తున్న వారు గుర్తించాలని అన్నారు. బీజేపీ కార్యకర్తల పై - మిగతా 5 లో

మహానాడుకు ముస్తాబైన ఒంగోలు

- ముందే చేరుకున్న చంద్రబాబు
- 17 అంశాలపై పొలిట్‌బ్యూరోలో చర్చ
- తొలిరోజు 12 వేల మందితో ప్రతినిధుల సభ
- చివరిరోజు లక్ష మందితో బహిరంగసభ



విశాలాంధ్ర బ్యూరో–ఒంగోలు :
తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మహానాడుకు ఒంగోలు ముస్తాబైంది. నేడు, రేపు ఒంగోలులో మహానాడు జరగనుంది. ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు గురువారం సాయంత్రానికే ఒంగోలు చేరుకున్నారు. రాత్రి పొలిట్‌బ్యూరో సమావేశాన్ని నిర్వహించి మహానాడులో చర్చించి తీర్మానించాల్సిన 16 అంశాలపై చర్చించారు. 2024 ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం అరాచకపాలనపైనా - మిగతా 5 లో

క్విట్ జగన్-సేవ్ ఏపీ

8లో

ఇదే రాష్ట్ర ప్రజల నినాదం కావాలి: చంద్రబాబు పిలుపు

సంపాదకీయం

గురువింద సుద్దులు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించి తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు కుటుంబ పాలనను తూర్పారబట్టారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ 20వ వార్షికోత్సవంలో పాల్గొనడానికి గురువారం హైదరాబాద్ వచ్చిన ప్రధానమంత్రి మోదీ తెలంగాణలో ఎలాగైనా అధికారంలోకి రావాలన్న బీజేపీ ఆరాటానికి ఊతం ఇవ్వడం కోసం కె.సి.ఆర్. వంశ పారంపర్య రాజకీయాల మీద దండయాత్ర చేశారు. కుటుంబ పాలన కొనసాగించే తెలంగాణ రాష్ట్ర సమితిని పక్కన పెట్టి ప్రజల కోసం పని చేసే బీజేపీకి పట్టం కట్టాలని మోదీ బేగం పేటలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో హితబోధ చేశారు. ఈ హితవు బీజేపీ కార్యకర్తల కోసమే, వారిని ఉత్సాహ పరచడానికే అన్న విషయాన్ని ఎవరూ ప్రత్యేకంగా విప్పి చెప్పనక్కర్లేదు. కాని అనువంశిక రాజకీయాలకు తాము వ్యతిరేకులమని పదే పదే గుర్తు చేసే మోదీ మాటల్లోని నిజాన్ని అంటే బీజేపీ ప్రోత్సహించే అనువంశిక రాజకీయాల లోగుట్టు అర్థం చేసుకోవడం బీజేపీ కార్యకర్తలకైనా కష్టమేమీ కాదు. ప్రతి అంశాన్ని రాజకీయమయం చేసి, బీజేపీని సర్వ వేళలా ఎన్నికలకు సంసిద్ధంగా ఉంచడానికే మోదీ పాటుపడడంలో భాగంగానే మళ్లీ వంశపారంపర్య రాజకీయాల ప్రస్తావించారని అర్థం చేసుకోవడానికి రాజకీయ పాండిత్యం అక్కర్లేదు. తెలంగాణ శాసనసభ ఎన్నికలు 2023 డిసెంబర్ లేదా ఆ ప్రాంతంలో జరగాలి. కానీ ఇప్పటి నుంచే మోదీ కె.సి.ఆర్. మీద కుటుంబ పాలన అన్న ప్రచారం ప్రారంభించారు. "అనువంశిక రాజకీయాలు ఉత్సాహవంతులైన యువకులు రాజకీయాలలోకి రాకుండా నిరోధిస్తాయి. ఇది 21వ శతాబ్దం. మనం అనువంశిక రాజకీయాలకు స్వస్తి చెప్పాలి. ఇలాంటి పాలన అంతమైన చోటల్లా అభివృద్ధి సాధ్యమైంది. కుటుంబ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి ముప్పు. అలాంటి పాలన అవినీతిమయంగా ఉంటుంది. అవినీతిమయమైన ప్రభుత్వంపై ప్రధాని చర్య తీసుకోవచ్చు కదా, ఎందుకు తీసుకోవడంలేదు? అనువంశిక పాలనను ప్రోత్సహించే పార్టీలు వీలైనంత కాలం అధికారానికి అంటిపెట్టుకుని ఉండాలని చూస్తాయి" అని మోదీ సుదీర్ఘంగా నీతి వచనాలు పలికారు. ప్రధానమంత్రి అభ్యర్థిగా 2014లో మోదీ జాతీయ రాజకీయ రంగంలో ప్రవేశించినప్పుడు కూడా ఇదే రకమైన విమర్శలు కాంగ్రెస్ మీద ఎక్కుపెట్టారు. ప్రచారార్భాటంలో దిట్ట అయినందు వల్ల జనం ఆయన మాటలు నిజమేననుకున్నారు. బీజేపీ మరో యుద్ధం ప్రారంభిస్తోందనీ అది తెలంగాణ ప్రజల కోసం అని మోదీ తెలంగాణ ప్రజలపై ఎక్కడ లేని అభిమానం కురిపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని బీజేపీ కాపాడుతుందట. తాను విమానాశ్రయం నుంచి బయటకు వస్తుంటేనే గాలిలో స్పష్టమైన మార్పు కనిపించిందట. ఇక వాతావరణ శాఖతో పనే ముంటుంది మరి! అవినీతికర, అనువంశిక రాజకీయ పార్టీలను తొలగదోస్తేనే దేశాభివృద్ధి సాధ్యమని అలవాటైన రీతిలో మోదీ సుద్దులు చెప్పారు. 2018 చివరిలో తెలంగాణ శాసనసభ ఎన్నికలలో బీజేపీకి దక్కింది ఒకే ఒక్క స్థానం. అయితే ఆ తరవాత దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికలలో సాధించిన విజయం, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో సాధించిన మెరుగైన ఫలితాలు బీజేపీకి రాష్ట్రంలో అధికారం సంపాదించాలన్న ఆశలు మొగ్గ తొడిగేలా చేసింది. అధికారం సంపాదించడమే ఏ రాజకీయ పార్టీకైనా లక్ష్యం అన్న మాటకు విప్రతిపత్తి లేదు. కాని అందు కోసం అనువంశిక రాజకీయాలను బాహాటంగా అనుసరిస్తున్న బీజేపీ ఇతర పార్టీలను ఆక్షేపించడం అర్థరహితమైందే కాదు హాస్యాస్పదం కూడా. వాస్తు బాగాలేదని కె.సి.ఆర్. సచివాలయానికి వెళ్లే వారు కాదని, అందుకే కొత్త సచివాలయం నిర్మిస్తున్నారని కూడా తెలంగాణ ముఖ్యమంత్రికి ఉన్న మూఢ నమ్మకాలను తూర్పారబట్టారు. ఈ విషయంలో బీజేపీ నాయకులు కూడా భిన్నమైన వారేమీ కాదుగా! తనకు మూఢనమ్మకాలు లేవనీ, విజ్ఞాన శాస్త్రాన్ని, సాంకేతికతను అనుసరిస్తానని చెప్పుకోవడం మరీ విచిత్రం. కాషాయ వస్త్రాలు ధరించే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్‌కు సైతం మూఢనమ్మకాలు లేవని మోదీ అప్రస్తుతంగా యోగీని పొగడ్తలతో ముంచెత్తారు. ఇదీ ఆయన వరస.

మోదీ పనిగట్టుకుని కె.సి.ఆర్. కుటుంబ రాజకీయాలను అభిశంసించడానికి కారణం లేకపోలేదు. ఇటీవలి కాలంలో మోదీ రెండుసార్లు హైదరాబాద్ వచ్చినా కె.సి.ఆర్. ప్రధానికి స్వాగతం చెప్పకపోగా కనీసం కలుసుకునే ప్రయత్నమైనా చేయలేదు. జీయర్ స్వామి అట్టహాసంగా రామానుజుడి విగ్రహం ప్రతిష్ఠించినప్పుడు కె.సి.ఆర్. మోదీకి ఎదురేగి స్వాగతం చెప్పలేదు. గురువారం మోదీ హైదరాబాద్ వస్తే కె.సి.ఆర్. బెంగళూరులో మాజీ ప్రధాని దేవగౌడతో చర్చించడానికి వెళ్లారు. కావాలనే కె.సి.ఆర్. తనను ఉపేక్షిస్తున్నారన్న అక్కసు మోదీకి ఉండొచ్చు. కానీ ఈ రెండు పర్యటనలు అధికారికమైనవి కావు అనే విషయాన్ని గుర్తిస్తే కె.సి.ఆర్.ను తప్పుబట్టే అవకాశమే లేదు. మాటల్ని తూటాలుగా ప్రయోగించడంలో కె.సి.ఆర్. ప్రధాన మంత్రి మోదీ కన్నా తక్కువేమీ కాదు. అందుకే బెంగుళూరు నుంచే కుటుంబ పాలన మీద మోదీ సంధించిన విమర్శలకు తగిన రీతిలో సమాధానం చెప్పారు. ఉపన్యాస పటిమ, శుష్క వాగ్దానాలు ఇక చాలు అని గట్టిగానే సమాధానమిచ్చారు. "పరిశ్రమలు మూతపడ్తున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. రైతులు, దళితులు, ఆదివాసులు కష్టాలు పడ్తున్న వాస్తవాన్ని కె.సి.ఆర్. గుర్తు చేశారు. "స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకుంటున్నాం. కానీ విద్యుత్తు, మంచి నీళ్లు, సాగు నీరుకు కొరత 75 ఏళ్ల స్వాతంత్ర్యం తరవాత కూడా కొనసాగుతూనే ఉంది" అని కె.సి.ఆర్. ప్రధానిని పరోక్షంగానే దెప్పి పొడిచారు. "అనువంశిక రాజకీయాలు కొత్త తరహా నియంతృత్వానికి దారి తీస్తాయి. అసమర్థత పెరుగుతుంది" అన్న మోదీ మాటల్లో నిజం ఉండొచ్చు. కానీ అనువంశిక రాజకీయాలను ప్రోత్సహించడంలో బీజేపీది కూడా ఘనమైన చరిత్రే. మోదీ మంత్రివర్గంలో వంశపారంపర్య రాజకీయాలవల్ల లబ్ధి పొందిన వారి జాబితా చేంతాడంత ఉంది. పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, అనురాగ్ ఠాకూర్, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజుజు, జ్యోతిరాదిత్య సింధియాల కుటుంబాలు రాజకీయాల్లో ఉన్నందువల్లే వీరందరూ వెలిగిపోయారన్నది వాస్తవం. వంశపారంపర్య రాజకీయాలను ఏవగించుకుంటున్నట్టు నటించే బీజేపీ కాంగ్రెస్ నుంచి రాజకీయ వారసత్వం ఉన్న జితిన్ ప్రసాదకు, బెంగాల్ ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారికి రాజకీయ వారసత్వం ఉందని తెలిసే బాహువులు చాచి ఆహ్వానించిన వాస్తవాన్ని మోదీ వాక్చాతుర్యం కూడా కప్పిపుచ్చడం లేదు. రాజకీయాల్లోకి రాకపోయినా అమిత్ షా కుమారుడు జే షా ఏ అర్హతతో బి.సి.సి.పై పెత్తనం చెలాయిస్తున్నట్టు? తమ పార్టీలో రాజకీయ వారసత్వం ఉన్న వారు మాత్రం స్వశక్తి మీద ఆధారపడి పదవుల్లోకి వచ్చారట. ఇది ఫక్తు వితండవాదం. బసవరాజ్ బొమ్మైని ముఖ్యమంత్రిని చేయడం ఆయన తండ్రి వారసుడిగా కాదట. సమర్థతవల్లేనట. జనాన్ని అసత్యాలతో నమ్మించడానికి ఇంతకు మించిన పన్నాగం ఏమైనా ఉందా? రాహుల్ గాంధీని "షెహజాదా" (యువరాజు) అని, యు.పి.ఎ. ప్రభుత్వాన్ని "ఢిల్లీ సల్తనత్" అని ఈసడించిన మోదీకి ఆయన పార్టీలో వారసత్వం కారణంగా పదవుల్లో ఉన్న వారి సుదీర్ఘమైన జాబితా చూసిన తరవాత కూడా తమది వారసత్వానికి ప్రాధాన్యం ఇచ్చే పార్టీ కాదని చెప్పే సాహసం ఎక్కడి నుంచి వస్తుందట! గొంగట్లో తింటున్న మోదీ తన ముఖం అద్దంలో చూసుకోవడం మంచిది.

కాలుష్య కోరల్లో ప్రజల ప్రాణాలు

డా. బుర్ర మధుసూదన్ రెడ్డి

పర్యావరణ కాలుష్య సంక్షోభంతో ప్రజారోగ్యం గాల్లో దీపం అవుతున్నదని, లక్షల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని 'పర్యావరణం-ఆరోగ్యం' అనే అంశంపై 'లాన్సెట్ హెల్త్ జర్నల్' ప్రచురించిన తాజా పరిశోధనా వ్యాసం పేర్కొంది. ఈ వ్యాసం ఎన్నో కఠిన వాస్తవాలను వివరించింది. దీని ప్రకారం పర్యావరణ విచ్ఛిన్న మానవ వ్యర్థాల కారణంగా నేల, నీరు, గాలి నాణ్యత పడిపోతున్నాయి. గాలిని కలుషితం చేసే పియం 2.5, ధూళి రేణువులు, ఓజోన్, సల్ఫర్/నైట్రోజన్ ఆక్సైడ్లతో పాటు నీటిని కలుషితం చేస్తున్న పాదరసం, నైట్రోజన్, పాస్ఫరస్, ప్లాస్టిక్, పెట్రోలియం వ్యర్థాలు ప్రధాన కాలుష్య కారకాలుగా ఉన్నాయి. వీటికి తోడుగా నేలను కలుషితం చేస్తున్న లెడ్, పాదరసం, ఎరువులు, పెస్టిసైడ్లు, పారిశ్రామిక రసాయనాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, రేడియో ధార్మిక వ్యర్థాలు జీవకోటి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

దుష్ప్రభావాల ఫలితం

పర్యావరణ కాలుష్యం కారణంగా 23.5 లక్షల అకాల మరణాలు నమోదు అయ్యాయని, ఒక్క గాలి కాలుష్య భూతంతోనే 16.7 లక్షల మరణాలు, కేవలం పియమ్ 2.5 గాలి కాలుష్యంతో 9.8 లక్షల మరణాలు, గృహ సంబంధ కాలుష్యంతో 6.1 లక్షల మరణాలు జరిగాయనే భయంకర వాస్తవాన్ని 'లాన్సెట్' అధ్యయన పరిశోధనా వ్యాసం వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా పలు రకాలైన కాలుష్య కోరల్లో చిక్కి 90 లక్షల మంది మరణించారని, ఇందులో అత్యధిక మరణాలు భారత్‌లో నమోదు అయ్యాయనే కఠిన

వాస్తవాన్ని బయట పెట్టింది. ఇండియాలో నీటి కాలుష్యం బారిన పడి 5 లక్షల మరణాలు, వృత్తిపరమైన కాలుష్యంతో 1.6 లక్షల మరణాలు, సీసం కాలుష్యంతో 2.3 లక్షల మరణాలు జరిగాయని తెలుస్తున్నది. గృహ, పరిసర సంబంధ కాలుష్యంతో ప్రపంచవ్యాప్తంగా 6.67 మిలియన్ల మరణాలు (ప్రపంచ మరణాల్లో 17.8 శాతం) సంభవించాయి.

కారణాలు

పారిశ్రామికీకరణ, పట్టణీకరణ, జనాభా విస్ఫోటనం, శిలాజ ఇంధన వినియోగం, కాలుష్య నివారణ చర్యలు లేకపోవడం వల్ల ప్రజారోగ్యం పడకేసింది. నీటి కాలుష్యంతో పిల్లలు, మహిళలు అధికంగా అనారోగ్యాలపాలు అవుతున్నారు. యుద్ధాలు, ఉగ్రవాదం, మలేరియా, హెచ్ఐవి, టిబి, మాదక ద్రవ్యాలు, ఆల్కహాల్ లాంటివి కారణమవుతున్నాయి. బయోమాస్ / బొగ్గు దహనం, వ్యవసాయ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో కాల్చడంతో గాలి కాలుష్యం రెచ్చిపోతున్నట్లు తేలింది. ప్రపంచ గాలి నాణ్యత నివేదిక-2021 ప్రకారం భారతదేశంలోని 50 నగరాల్లో 35 నగరాలు గాలి కాలుష్యంతో సతమతం అవుతున్నాయి. మన దేశ రాజధాని వరుసగా నాలుగవసారి ప్రపంచంలోనే అత్యధిక కాలుష్య నగరంగా రికార్డు అయింది. వాతావరణ ప్రతికూల మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు, అకాలవర్ష వడగళ్లు, జీవ వైవిధ్య విచ్ఛిన్నం, పెరుగుతున్న కాలుష్య గాఢతలతో మానవ జీవితాలు ప్రభావితం కావడమే కాకుండా జీవకోటి మనుగడ కూడా ప్రశ్నార్థకం అవుతోంది. వాతావరణ మార్పులతో అసాధారణ కరోనా లాంటి విపత్తులు, అంటు వ్యాధులు ప్రబలి మానవాళిని పట్టి పీడిస్తున్నాయి. భారత్‌లో ఒక్క 2021 సంవత్సరంలోనే 1.93 లక్షల మంది డెంగ్యూ బారినపడగా, 2018 తరవాత అత్యధికంగా 306 మంది మరణించడం కూడా గమనించారు. అకాల వర్షాలతో అంటువ్యాధులు రెచ్చిపోతున్నాయి. భూతాపంతో వాతావరణ మార్పులు పెరగడం ప్రాణికోటికి ప్రమాదకరంగా మారుతున్నది. శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం రానున్న 80 ఏండ్లలో భూతాపంతో సగటు వాతావరణ ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల వరకు పెరిగితే మనిషి/ప్రాణికోటి మనుగడ మహాసంక్షోభంలో పడుతుందని హెచ్చరిస్తున్నారు. గాలి కాలుష్యంతో ఆసియా, పసిఫిక్ దేశాలపై భారీగా ఆర్థిక భారం పడుతుంది. నివారణ చర్యలకు పాలకులు, ప్రజలు పూనుకోవాలి.

వ్యాస రచయిత సెల్ 9949700037

ఆధునిక భారత దార్శనికుడు రామ్‌మోహన్‌రాయ్

దీపాంకర భట్టాచార్య

ఆధునిక భారతాన్ని దర్శించిన అనేక మంది ప్రముఖులలో రామ్‌మోహన్‌రాయ్ ప్రసిద్ధులు. గొప్ప సంఘ సంస్కర్త. ఆయన 250వ జయంతిని ఈ ఏడాది జరుపుకున్నాం. ఆధునిక భారత నిర్మాణం కోసం ఆయన నిరంతర పోరాటం జరిపారు. 21వ శతాబ్ది ఆరంభంలో నేటి పాలకులు చరిత్రను వక్రీకరిస్తూ, హింసాత్మకమైన కక్షపూరిత విధ్వంసాన్ని సృష్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు మూడు శతాబ్దాల నాడు పాలించిన మొఘలులు దేశంలో అనేక అక్రమాలకు పాల్పడ్డారని ఇప్పటి పాలకులు ప్రచారం చేస్తున్న నేపథ్యంలో రామ్‌మోహన్‌రాయ్, ఆయన సమకాలీకులు చేసిన పోరాటాలను, వాస్తవాలను తెలుసుకోవటం అవసరం. నిరంకుశ వలస పాలనకు వ్యతిరేకంగా ఆధునిక భారత నిర్మాణంపైన 19 వ శతాబ్దం ప్రారంభంలో రామ్‌మోహన్‌రాయ్ గొప్ప ఉద్యమం చేశారు. పశ్చిమ బెంగాల్‌ను ఈస్టిండియా కంపెనీ ఆక్రమించుకున్న తర్వాత 15 ఏళ్లకు 1772లో రామ్‌మోహన్‌రాయ్ జన్మించారు. పలాసి (ప్లాసి) యుద్ధంలో సిరాజ్-ఉద్-దౌలాను ఓడించి రాష్ట్రాన్ని ఆక్రమించుకున్నారు. వ్యాపారులు పాలకులుగా మారిపోయారని విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాపారులే ఆ తర్వాత దేశం మొత్తాన్ని ఆక్రమించి పాలించారు.

రామ్‌మోహన్‌రాయ్ తన జీవితంలో మొదటి 40 ఏళ్ల కాలంలో ప్రధానమైన మతాల రాత ప్రతులను, కీలకమైన మూల రచనలను లోతుగా అధ్యయనం చేయడమేగాక తరుచుగా వాటిని అసలు భాషలలో చదివారు. అనేక భాషలలో ప్రావీణ్యం ఉంది. సంస్కృతంతో సహా అరబిక్, పర్షియన్ నుంచి ఇంగ్లీషు, లాటిన్ గ్రీకు వరకు అనేక భాషలపై ఆయనకు పట్టు ఉంది. ఈస్టిండియా కంపెనీలో రెవిన్యూ అధికారిగా పని చేశారు. రచనలు, సామాజిక చైతన్య కార్యకలాపాల నిర్వహణ కోసం ఉద్యోగం వదిలేశారు. అంతకు ముందే 1815లో కలకత్తాలో స్థిరపడ్డారు. సతీ సహగమనం నిషేధంలో రామ్‌మోహన్‌రాయ్ కృషి ఎన్నటికీ మరువలేం. భర్త చనిపోతే భార్య తనంతట తానుగా అగ్నికి ఆహుతి చేసేకొనే సంప్రదాయం హిందువులలో ఉన్నదని చెప్పడం శుద్ధ అబద్ధం. భర్త చనిపోయినప్పుడు భార్యను బలవంతంగా మంటలకు ఆహుతి చేయడం అనేది మత పరంగా జరుగుతూ వచ్చింది. ఈ పద్ధతిని నిషేధించటంలో రామ్‌మోహన్‌రాయ్ గొప్పగా కృషి చేశారు. ఆ రోజుల్లో బహుభార్యాత్వం ఎక్కువగా ఉండేది. దీని అర్థం మహిళలు త్యాగం చేయటమే. రామ్‌మోహన్‌రాయ్ కుటుంబంలోనే ఆయన వదిన ఈ చెడు సాంప్రదాయానికి బలయ్యారు. దీంతో ఈ సంప్రదాయం రద్దు కోసం సాహసోపేతమైన కృషి

జరిపారు. ఆయన ప్రారంభించిన 'సంబద్ కౌముది' పత్రికలో అనేక వ్యాసాలు రాశారు. దీంతో ఆనాటి గవర్నింగ్ జనరల్ విలియం బెంటిక్ 1829లో సతీ సహగమనాన్ని నిషేధించారు.

హిందు మహిళల హక్కులను సాధించేందుకు సతీ సహగమనంపై నిషేధం చరిత్రాత్మక చర్య. అలాగే రామ్‌మోహన్‌రాయ్, విద్యాసాగర్‌ల కృషి ఫలితంగా 1856లో వితంతు పునర్వివాహ చట్టాన్ని చేశారు. 1952లో హిందు కోడ్ బిల్లులను రూపొందించారు. 1956లో అంబేద్కర్, నెహ్రూ నాయకత్వంలో ఈ బిల్లులను చట్టం చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలు తిరిగి సతీ సహగమనాన్ని ప్రవేశ పెట్టడానికి 1987లో జరిగిన రూప్‌కన్వర్ సతీ కేసును అవకాశంగా తీసుకున్నారు. సహేతుకత, ఆధునికత తదితర ప్రగతిశీల అజెండాలో భాగంగా సతీ సహగమనం వ్యతిరేక ప్రచారాన్ని రామ్‌మోహన్‌రాయ్ నిర్వహించారు. ఆయన మతం, సామాజిక సంస్కర్తగా, విద్యావేత్తగా, జర్నలిస్టుగా ప్రసిద్ధి అయ్యారు. మహిళలకు ఆస్తి హక్కు కోసం ఆయన పోరాడారు. 1870 వరకు ఇంగ్లండులో కూడా ఇలాంటి చట్టం లేదు. అయినా దాని కోసం రామ్‌మోహన్‌రాయ్ చేసిన పోరాటం ప్రాముఖ్యత సంతరించుకుంది. సార్వత్రిక మతం, బ్రహ్మసభ, బ్రహ్మ సమాజం వైపు ఆయన దృష్టి మళ్లింది. హిందు సమాజంలో ఉన్న కుల జాడ్యాన్ని నిర్మూలించేందుకే ఆయన ఈ పని చేశారు. మొఘల్ చక్రవర్తి వంశీకులు రామ్‌మోహన్‌రాయ్ సమకాలీకులు. 19వ శతాబ్దిలో మొఘల్ చక్రవర్తి అక్బర్‌షా-2 1806 నుండి 1837 వరకు పరిపాలన చేశారు. అప్పుడు రామ్‌మోహన్‌రాయ్‌ని గౌరవిస్తూ రాజా బిరుదును ఇచ్చారు. మొఘల్ చక్రవర్తి దూతగా ఆయన 1830లో బ్రిటన్‌కు వెళ్లారు. అక్కడ జబ్బుపడి వెళ్లిన మూడేళ్లకే మరణించారు.

రామ్‌మోహన్‌రాయ్ మరణం తర్వాత రెండు దశాబ్దాలకు నిర్దిష్ట రూపంలో స్వాతంత్ర్యం కోసం పోరాడాలన్న చైతన్యం ప్రజలలో వచ్చింది. 18వ శతాబ్ది చివరిలో అనేక ఆదివాసీ తిరుగుబాట్లు జరిగాయి. 1857లో మొదటి స్వాతంత్ర్య పోరాటం జరిగింది. దీన్ని స్ఫూర్తిగా తీసుకొని ఈ భూమి మనకు చెందిన హిందుస్థాన్ అన్న అర్థం వచ్చేలాగా అజిముల్లాఖాన్ కవిత రాశారు. స్వాతంత్ర్యం కోసం ఉత్తర భారతంలోని అనేక ప్రాంతాల్లో తిరుగుబాట్లు చోటు చేసుకొన్నాయి. వలస పాలకుల హింసాకాండను ఎదుర్కొనేందుకు హిందువులు, ముస్లింలు చేయి చేయి కలిపి పోరాటాలు చేశారు. రాణి లక్ష్మీబాయి, బేగం హజరత్ మహల్, కన్వర్ సింగ్, మౌల్వీ అహ్మదుల్లా షా ఫైజాబాదీ లాంటి పోరాట యోధులు ఒకే గొడుగు కిందకు వచ్చి పని చేశారు. రామ్‌మోహన్‌రాయ్ మరణం తర్వాత 19వ శతాబ్దిలో మొఘల్ చక్రవర్తి షా-2 కుమారుడు చివరి చక్రవర్తి బహదూర్‌షా జఫర్ నాయకత్వంలో 1857లో స్వాతంత్ర్య పోరాటాలు జరిగాయి. 1862 నవంబరు 8న బహదూర్‌షా రంగూన్‌లో ప్రవాస జీవనం సాగిస్తూ మరణించారు. కుట్ర స్వభావంతో సంఘ్-బీజేపీలు మొఘల్ వంశ పాలనకు వ్యతిరేకంగా 21వ శతాబ్దంలో ప్రచారం సాగిస్తున్నారు. స్వాతంత్ర్య పోరాట చరిత్ర లేని వీరు స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిపై బురద జల్లడం దుర్మార్గం. రామ్‌మోహన్‌రాయ్‌లాంటి అనేకమంది సంఘ సంస్కర్తలు, స్వాతంత్ర్య లక్ష్య సాధనకు పోరాడిన వారు ఆధునిక భారతదేశ నిర్మాణానికి సామాజిక మత సంస్కరణకు, సాంస్కృతిక విద్యారంగాల పురోగతికి ఎనలేని కృషి చేశారు. అలాగే బెంగాల్‌లో విద్యాసాగర్, జ్యోతిబా, సావిత్రిబాయిపూలే, మహారాష్ట్రలో ఫాతిమా షేక్ తదితరులు స్వాతంత్ర్య ఉద్యమానికి ఎంతగానో స్ఫూర్తి నిచ్చారు. వీరంతా వైవిధ్యభరితమైన, బహుళమైన, ప్రజాస్వామ్య భారత స్వాతంత్ర్యం కోసం ఆకాంక్షించి కృషి చేశారు. ఇప్పుడు ఒంటెత్తు పోకడలతో నియంతృత్వ వైఖరిని ప్రదర్శిస్తూ మూఢనమ్మకాలను ప్రచారం చేస్తూ తమకు గిట్టని వారిపై విద్వేషాన్ని వెళ్లగక్కడం మానవాళి వృద్ధికి ఎంతమాత్రం దోహదం చేయదు.

వ్యాస రచయిత సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి

ఐ-మెయిల్

నిరుపేదలకు ఉచిత న్యాయసేవలు

ప్రతి పౌరునికీ న్యాయం పొందే హక్కు వుండాలని.. ఇందులో ధనిక, పేద అనే భేదాభిప్రాయం వుండకూడదని ... చట్టాలు అందరికీ చుట్టాలు అని భావించి రెండు దశాబ్దాల కిందట భారత ప్రభుత్వం ఉచిత న్యాయ సేవల విధానాన్ని (లీగల్ సర్వీస్ అథారిటీ సర్వీసెస్) తీసుకొచ్చింది. జాతీయ స్థాయిలో ఈ లీగల్ సర్వీస్ అథారిటీకి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి రాష్ట్ర స్థాయిలో హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. జిల్లా స్థాయిలో జిల్లా జడ్జీ ఛైర్మన్‌గా నియమితులవుతున్నారు. ఎక్కడైతే కోర్టు వుంటుందో అక్కడ తప్పనిసరిగా ఈ న్యాయ సేవాసదన్ వుంటుంది. అత్యంత నిరుపేదలు, వికలాంగులు, అభాగ్య మహిళలు, ఆదివాసీలు, ఏజెన్సీ గిరిజనులు తదితర పేద అల్పసంఖ్యాక వర్గాలు తమ సమస్యలను న్యాయవాదుల ద్వారా విన్నవించుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. న్యాయవాదులకు ఫీజు చెల్లించడానికి అవకాశం లేని వాళ్లు తమ సమస్యను తెల్ల కాగితం మీద క్లుప్తంగా రాసి అందుకు సంబంధించిన ఆధారాలు జోడించాలి. వీటిని మండల స్థాయిలో (కోర్టు వున్న మండల కేంద్రంలో) సెక్రటరీ, మండల న్యాయసేవా సదన్, ఫలానా కోర్టు క్యాంపస్ అనే చిరునామాకు పోస్టల్ ద్వారా పంపించవచ్చు. లేదా స్వయంగా వెళ్లి ఆయా కోర్టుల ప్రాంగణంలో ఈ లీగల్ సర్వీస్ అథారిటీ విభాగాలను సందర్శించి సంబంధిత అధికారులకు అందజేయాలి. వీటికి సంబంధించిన ప్రత్యేక బెంచ్ ప్రతి శనివారం స్థానిక న్యాయమూర్తులతో సమావేశం అవుతుంది. ఆ న్యాయమూర్తుల ఆదేశాల ప్రకారం ప్రతివాదులకు సంబంధిత కోర్టు ఉద్యోగులు నోటీసులు పంపిస్తారు. సమస్య తీవ్ర తను

బట్టి కోర్టు ఆధ్వర్యంలోనే ఫిర్యాదుదారులకు ఒక న్యాయవాదిని నియమిస్తారు. ప్రభుత్వ ఖర్చులతో ఆ న్యాయవాదికి సంబంధిత న్యాయస్థానం కొంత నామ మాత్రపు ఫీజు చెల్లిస్తుంది. ఈ మధ్యకాలంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ ఈ న్యాయ సేవా సదన్‌లకు మరింత ప్రాధాన్యత పెంచారు. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీటి నిర్వహణ ఖర్చులకు విరివిగా నిధులు విడు దల చేయవలసి వుంది. మొత్తం మీద అందుబాటులో వున్న ఈ ఉచిత న్యాయ సేవల విధానాన్ని ఎంతో కొంతమేర అత్యంత నిరుపేదలు, ఇతరులు సద్వి నియోగం చేసుకోవాలి. ఇటీవల కాలంలో ఈ ఉచిత న్యాయసేవల వ్యవస్థను ప్రచా రం చేయడానికి జిల్లా జడ్జీల ఆధ్వర్యంలో 3, 4 రోజులు శిక్షణ ఇచ్చి ప్రాథమిక న్యాయ పరిజ్ఞానంతో కూడిన కొన్ని చట్టాల పుస్తకాలను ఉచితంగా అందజేస్తూ పారాలీగల్ వాలంటీర్లను (న్యాయసేవ సహాయకులు) నియమిస్తున్నారు.

కె. ధనలక్ష్మి, లీగల్ సర్వీసెస్ రైట్స్ ప్రొటెక్షన్ సెక్రటరీ, 9440160382

సిద్ధేశ్వరం సిద్ధించేనా - సీమకు సాగు తాగునీరు లభించేనా?

దా. యం. సురేష్ బాబు

పాలకుల నిర్లక్ష్యం కారణంగానే సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం జరగడం లేదు. కృష్ణా, తుంగభద్ర నదులలో నీరు ఉన్నా యేటా రాయలసీమకు కరువు తప్పడంలేదు. ప్రభుత్వాలు ప్రకటనలు, బూటకపు వాగ్దానాలకే పరిమితమయ్యాయి. ఈ క్రమంలో రాయలసీమకు చట్టబద్ధ నీటిహక్కులు సాధించుకునేందుకు మరో నాలుగు రోజుల్లో (మే 31వ తేదీన) ఆరవ ప్రజా శంఖుస్థాపనను పురస్కరించుకుని సిద్ధేశ్వరం వద్ద వేలాది మందితో జలదీక్ష నిర్వహించాలని రాయలసీమ సాగునీటి ఉద్యమ నాయకులు అన్ని జిల్లాల్లో సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఈ సదస్సుల ద్వారా సిద్ధేశ్వరం ఆవశ్యకతను తెలియచేసే ప్రయత్నంలో వివిధ సంఘాలు సంఘీభావంతో జలదీక్షను జయప్రదం చేయడానికి పిలుపునిస్తున్నాయి. రాయలసీమలోని ఎనిమిది జిల్లాల్లో సిద్ధేశ్వరం అలుగు ఉద్యమం స్ఫూర్తితో చట్టబద్ధ నీటిహక్కుల సాధనకు ప్రజా ఉద్యమం చేసి సిద్ధేశ్వరం అలుగు సాధించే వరకు పోరాడాల్సిన అవసరం ఉంది. గ్రామ, మండల, జిల్లా స్థాయిలలోని అన్ని రైతు సంఘాలు ప్రజా సంఘాల సమన్వయంతో ఉద్యమస్ఫూర్తి చాటి పట్టణాలలోని ప్రజలను కూడా తాగునీటి పరిష్కారానికి రాయలసీమ సాగునీటి ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరుతూ ముందుకెళ్లాలి.

సిద్ధేశ్వరం రాయలసీమ ప్రజల చిరకాల స్వప్నం. దాదాపు శతాబ్దం పాలకుల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యం. ఫలితంగా రతనాల సీమగా ఉండాల్సిన రాయలసీమ నేడు కరువు సీమగా మారి ప్రపంచం ముందు సాయం కోసం దీనంగా నిలబడిన దైన్యస్థితి. 1911-12 ప్రాంతంలో ఆంగ్లేయుల కాలంలో మెకన్జీ సిఫార్సుల మేరకు సిద్ధేశ్వరం సర్వే చేసి నిర్మాణానికి అంగీకారం తెలిపారు. తదనంతరం 1958 ప్రాంతంలో భారత ప్లానింగ్ కమిషన్ పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. రాయల సీమకు 18 లక్షల ఎకరాలకు, నాటి తమిళనాడుకు 5 లక్షల ఎకరాలకు మొత్తం 22 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా దాదాపు 250 టిఎంసిల సామర్థ్యంతో ప్రాజెక్టును రూపొందించారు. అదే జరిగి ఉంటే నేడు రాయలసీమకు 250 టిఎంసిల నికర జలాలు హక్కుగా మారి ఉండేది. అంతేకాదు సీమ మొత్తం వ్యవసాయం వృద్ధి చెంది దానికి అనుబంధంగా పరిశ్రమలు, అపార ఖనిజ సంపద, వాతావరణ అనుకూల పరిస్థితుల నేపథ్యంలో గణనీయమైన అభివృద్ధి సాధించి భారతదేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతంగా నేడు మన రాయలసీమ ఉండేది. అందుకే సిద్ధేశ్వరం నిర్మాణం రాయలసీమ నీటి అవసరాలకు అత్యంత ముఖ్యం. నికర జలాలు ఉన్నా అనుభవించలేని దుస్థితి. రాయలసీమకు నికర జలాల కేటాయింపులో అన్యాయం జరిగింది. ఉన్న 133.7 టిఎంసిలలోనూ కనీసం సగం నీటిని కూడా వాడుకోలేక పోతున్నాం. ప్రాజెక్టులవారీగా పరిశీలిస్తే.. తుంగభద్ర హైలెవల్ కెనాల్‌కి ఉన్న 32.5 టిఎంసిలో 17, 18 టిఎంసిలు, ఎల్ఎల్సీ 29.5 టిఎంసిలలో 11

టిఎంసిలు మాత్రమే వాడుకుంటున్నాం. కెసి కెనాల్‌కు 39.9 టిఎంసిలు ఉండగా ప్రభుత్వం కాకి లెక్కలు చెప్పి 50, 60 టిఎంసిలు డ్రా అవుతున్నట్లు చూపిస్తోంది, కాని వాస్తవంలో 15 టిఎంసిలు మాత్రమే వాడుకుంటున్నాం. బైరవానితిప్ప 4.9 టిఎంసిలలో వాడుతున్నది కేవలం 0.5 టిఎంసిలే. ఎస్ఆర్బీసీలో 19 టిఎంసిలు ఉన్నా అందులో ఉపయోగించుకుంటున్నది 7, 8 టిఎంసిలు మాత్రమే. స్థూలంగా చెప్పాలంటే సీమకు అధికారికంగా, హక్కుగా ఉన్న 133.7 టిఎంసిలలో మనం దాదాపు సగం అంటే 65 టిఎంసిలను వాడుకోవడంలేదు. దీని ఖరీదు వరి పంట అయితే కనీసం 5, 6 లక్షల ఎకరాలు, అదే డ్రిప్ లాంటి వ్యవసాయం అయితే 13 లక్షల ఎకరాలు పంట నీటిని వాడుకోలేని పరిస్థితి. ఇవి కాక శ్రీశైలంలోని క్యారీ ఓవర్ క్రింద 60 టిఎంసిలు, పట్టిసీమ నిర్మాణం ద్వారా 45 టిఎంసిలు, పులిచింతల ద్వారా ఒప్పందం మేరకు 54 టిఎంసిలను మనం వాడుకోవాలి. అంటే దాదాపు 159 టిఎంసి ఇంకా రాయలసీమ వాడుకోవడానికి అవకాశం ఉంది. అధికారికంగా ఉన్న 133.7 టిఎంసిలనే వాడుకునే ఏర్పాట్లు లేనపుడు ఇంకా అవకాశం ఉన్న 159 టిఎంసిలను ఎలా వాడుకోవాలి. రెండు కారణాల వలన సీమ ప్రాంతం నీటిని వాడుకోలేకపోతోంది. ఇందులో ఒకటి నీటి నిల్వ చేసుకునే ఏర్పాట్లు తగినంతగా సీమలో లేవు. రెండోది అవకాశం ఉన్న శ్రీశైలంలో 854 అడుగుల ఎత్తుకు నీటిని ఉంచకుండా 69 జీఓ ద్వారా 834 అడుగుల వరకు నీటిని క్రిష్ణా డెల్టాకు తీసుకు వెళుతుండటం వలన సీమకు నీటి కష్టాలు వచ్చాయి. అందుకే జీఓ నెం 69ని రద్దు చేసి శ్రీశైలం నీటి మట్టాన్ని 854 అడుగులు ఉండేలా చూడటం. శ్రీశైలానికి 86 కిలోమీటర్ల పైన 860 అడుగుల ఎత్తులో సిద్ధేశ్వరం అలుగును నిర్మించాలి. ఈ అలుగును శ్రీశైలానికి పైన నిర్మిస్తాం కాబట్టి 50 టిఎంసిల నీటిని నిల్వ ఉంచుకోవడానికి అవకాశం ఉంటుంది. కృష్ణా నీరు సిద్ధేశ్వరం పొంగిన తర్వాతనే శ్రీశైలానికి వెళుతుంది. అంటే కచ్చితంగా 50 టిఎంసిలు నీరు నిల్వ ఉంటుంది. బ్యాక్ వాటర్‌తో పనిచేసే పోతిరెడ్డిపాడు 842 అడుగులు కాబట్టి కనీసం 19 అడుగుల నీరు చేరి తెలుగు గంగా, గాలేరు-నగరి, ఎస్ఆర్బీసీలకు నీటి సమస్య పరిష్కారమవుతుంది. హంద్రీ-నీవా ఎత్తిపోతల పథకానికి నీటి సమస్య రాకుండా ఉండటంతోబాటు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం ద్వారా బైరవానితిప్ప ప్రాజెక్టుకు కూడా నీరు ఇవ్వవచ్చు.

మారిన పరిస్థితులలో ఆవశ్యకత

సీమ పైన తెలంగాణతో సహ మిగిలిన రాష్ట్రాలూ ప్రాజెక్టులు కడుతున్నాయి. అవి తర్వాత కాలంలో నికర జలాల ప్రాజెక్టులుగా మారిపోతే సీమకు నీటి మీద కనీస హక్కు ఉండదు. అందుకే ఒకసారి సిద్ధేశ్వరం ప్రాజెక్టును కోల్పోయి దాదాపు 250 టిఎంసిల నికర జలాలను కోల్పోయాం. మళ్లీ ఇప్పుడు ఆ చిన్నపాటి ప్రాజెక్టును కూడా సాధించుకోకపోతే సీమ భవితవ్యం ప్రమాదంలో పడుతుంది. శ్రీశైలం ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం పూడిక వల్ల 140 టిఎంసిలు తగ్గింది. శ్రీశైలం భద్రత రీత్యా ఒత్తిడి తగ్గించాల్సిన అవసరాన్ని సిడబ్ల్యూసి ఎప్పుడో గుర్తించింది. పోలవరం పూర్తి అయితే కృష్ణా డెల్టా అవసరం తీరుతుంది కనుక రాయలసీమకు శ్రీశైలం నీటిని వినియోగించే అవకాశాలు తక్కువ. తెలంగాణకు నాగార్జున సాగర్ ద్వారా 99.5 టిఎంసి నీటిని శ్రీశైలం నుంచి నీరు తీసుకునే హక్కు ఉంది. ప్రారంభంలో ఆ నీటిని తీసుకుంటే కనీస నీటి మట్టం నిర్వహణ సాధ్యం కాదు. అందువలన రాయలసీమ నీటి అవసరాలకు సిద్ధేశ్వరం కచ్చితంగా కీలకం. దాన్ని సాధించుకోవడం రాయలసీమ ప్రజల కర్తవ్యం. వైయస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పోతిరెడ్డిపాడు వెడల్పు, కాల్వల సామర్థ్యం పెంపు, రిజర్వాయర్‌ల నిర్మాణం వైపు అడుగులు వేస్తోంది. 40 వేల కోట్ల రూపాయల అంచనాతో ఎస్పీవీని ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టు పరిధిలోకి సిద్ధేశ్వరం, గుండ్రేవుల, సోమశిల-కండలేరు సామర్థ్యం 4 టిఎంసిలకు పెంచడం, చెరువుల పునరుద్ధరణ పనులను చేర్చాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడంతో పాటు గత ప్రభుత్వాల నిర్లక్ష్యంపై రాయలసీమ సమాజం పోరాడింది. ఇప్పుడున్న ప్రభుత్వం పరిష్కరించాలని ఆశిస్తోంది. రాయలసీమ ప్రజల ఆకాంక్షలను, రాయలసీమ నీటి సమస్య పరిష్కారానికిగాను సిద్ధేశ్వరం నిర్మాణంపై అధికారిక నిర్ణయం తీసుకోవాలని సిద్ధేశ్వరం ప్రజా శంకుస్థాపన ఆరవ వార్షికోత్సవం సందర్భంగా రాయలసీమ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వ్యాస రచయిత గౌతమ్ బుద్ధా అభివృద్ధి సమాఖ్య అధ్యక్షులు

ఈలింగ్ మేయరుగా దళితమహిళ

లండన్: భారత సంతతికి చెందిన నాయకురాలు, యూకేలో ప్రతిపక్ష లేబర్ పార్టీ కౌన్సిలర్ మొహిందర్ కె.మిధా పశ్చిమ లండన్‌లోని ఈలింగ్ కౌన్సిల్ మేయర్‌గా ఎన్నికయ్యారు. తద్వారా యూకేలో తొలి దళిత మహిళా మేయర్‌గా ఆమె రికార్డుకెక్కారు. మొహిందర్ కె.మిధా ఎన్నికపై లేబర్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. ఇది తమకు గర్వకారణమని యూకేలోని 'ఫెడరేషన్ ఆఫ్ అంబేడ్కరైట్, బుద్ధిస్ట్ ఆర్గనైజేషన్' చైర్మన్ సంతోష్‌దాస్ చెప్పారు. మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో మిధాను 2022-23 తదుపరి ఏడాది కాలానికి ఎన్నుకున్నారు.

సామ్రాజ్యవాద కూటమి అత్యంత ప్రమాదకారి

స్వీడన్ కమ్యూనిస్టు నేత ఆండ్రియాస్ సోరెన్‌సెన్ ఇంటర్వ్యూ

స్వీడన్ : కమ్యూనిస్టులుగా ప్రతి సామ్రాజ్యవాద కూటమి బలపడటాన్ని వ్యతిరేకిస్తాం. సమకాలీన ప్రపంచంలో బలమైన సామ్రాజ్యవాద కూటమి నాటోలో స్వీడన్ చేరిక అంశంపై కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ స్వీడన్ (ఎస్‌కేపీ) చైర్మన్ ఆండ్రియాస్ సోరెన్‌సెన్ వామపక్ష టర్కిష్ వార్తాపత్రిక 'ఎవ్రెన్‌సెల్' కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పైవిధంగా వ్యాఖ్యానించారు. ఈ ప్రక్రియ నోర్డిక్, బాల్టిక్ ప్రాంతాలలో ప్రజలకు తీవ్ర ముప్పును సూచిస్తుందని పేర్కొన్నారు. నాటో సామ్రాజ్యవాద కూటమిలో స్వీడన్ చేరిక సామ్రాజ్యవాదాన్ని మరింత బలోపేతం చేయడాన్ని సూచిస్తుంది. సామ్రాజ్యవాద వ్యవస్థలో నెలకొన్న వైరుధ్యాల మధ్య, తమ ప్రయోజనాలను కాపాడుకోవడంలో నాటో సభ్య దేశాలు మరిన్ని చర్యలు తీసుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో అవసరంగా ఉందని సోరెన్‌సెన్ పేర్కొన్నారు.

"స్వీడన్ నాటోలో చేరదు. తటస్థీకరణ మనకు మేలుచేసింది" అని సోషల్ డెమొక్రాట్‌ల మహాసభ ధృవీకరించింది. ఏడాది తర్వాత సభ్యత్వం పొందేందుకు వారే ప్రధానంగా పనిచేస్తున్నారు. ఉక్రెయిన్‌పై దాడి, పశ్చిమదేశాల పెట్టుబడి,రష్యా పెట్టుబడుల మధ్య పోటీకి గుణాత్మకమైన అడుగుపడిందన్నారు. అదే సమయంలో బాల్టిక్ సముద్రం స్వీడన్‌కు మాత్రమే కాకుండా రష్యాకు

కూడా వ్యూహాత్మకంగా మారింది. స్వీడన్ ప్రధానంగా జర్మన్, అమెరికా మార్కెట్లతో ముఖ్యమైన ఆర్థిక సంబంధాలను కలిగి ఉందని పేర్కొన్నారు. నాటోలో స్వీడన్ సభ్యత్వం రెండు విభిన్న పరిణామాలను చూడవచ్చు. స్వీడన్-రష్యాల మధ్య సంబంధాలు క్షీణిస్తాయి. రెండు దేశాల మధ్య ఆర్థిక,రాజకీయ మార్పిడి తగ్గుతుందని పేర్కొన్నారు. సాధారణంగా, ప్రపంచంలోని సామ్రాజ్యవాద కూటములు తమను తాము ఏకీకృతం చేసుకునే ప్రక్రియలో ఇది భాగం. వైరుధ్యాల మధ్య తటస్థంగా ఉండటం, ఏ కూటమికి వెలుపల ఉనికిలో ఉండటం కష్టతరంగా మారుతోంది. ఈ తర్కం కేవలం ఫిన్లాండ్, స్వీడన్‌లకే కాదు, ప్రపంచంలోని ప్రతి పెట్టుబడిదారీ దేశానికి వర్తిస్తుంది, ఎందుకంటే ప్రతి పెట్టుబడిదారీ దేశం ఒకే వ్యవస్థలో భాగం. నాటోకి వ్యతిరేకంగా స్వీడన్ ప్రజల నుండి నిరసన లేదు. ఒక పార్టీగా ఈ సభ్యత్వాన్ని నిరోధించడానికి మీకు ప్రణాళిక ఉందా? అన్న ప్రశ్నకు బదులుగా సోరెన్‌సెన్ మాట్లాడుతూ

స్వీడన్ ప్రజలు పారదర్శకంగా ఉంటారు, దేశప్రజల్లో గణనీయమైన భాగం నాటో సభ్యత్వాన్ని తిరస్కరిస్తున్నారు. అయితే, వారు తమ అభిప్రాయాలను వీధుల్లోకి తీసుకెళ్లరు అని పేర్కొన్నారు.

అభివృద్ధికి వ్యతిరేకంగా నిరసనలు, ప్రదర్శనలు ఉన్నాయి, కానీ అవి రాజకీయంగా అపరిపక్వంగా ఉన్నాయి. ఉద్యమంలోని కొంతమంది రష్యా ఉక్రెయిన్‌పై దండయాత్రకు మద్దతు ఇస్తుండగా వ్యతిరేకులు ఉక్రెయిన్‌కు ఆయుధాల పంపిణీకి మద్దతు ఇస్తున్నారు. ఉక్రెయిన్, రష్యాలోని శ్రామిక ప్రజలకు మద్దతుగా ఎవరూ నిలబడలేకపోయారని పేర్కొన్నారు.

ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్

మనీలా : ఫిలిప్పీన్స్‌లో ఈ నెల ప్రారంభంలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్ విజేతగా ఫిలిప్పీన్స్ కాంగ్రెస్ ప్రకటించింది. ఈ ఎన్నికల్లో మార్కోస్ 59శాతం ఓట్లను పొందారు. బుధవారం జరిగిన కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ఫిలిప్పీన్స్ తదుపరి అధ్యక్షుడిగా నియమితులయ్యారు. మార్కోస్ జూనియర్ జూన్ 30న పదవీ బాధ్యతలు స్వీకరిస్తారు. ఈ సందర్భంగా మార్కోస్ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రకటనకు ముందు, ఎన్నికల ఫలితాలను నిరసిస్తూ నిరసనకారులు మానవ హక్కుల కమిషన్ వద్ద ప్రదర్శన చేపట్టడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు వాటర్ క్యానన్‌లు వినియోగించారు.

ధరలు తగ్గించాల్సిందే

(మూడో పేజీ తరువాయి)

నిర్వహించారు. అధిక ధరలను అరికట్టాలని, పన్నుల భారాలను విరమించాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలపై అన్ని సర్‌చార్జీలను, సెస్సులను ఉపసంహరించాలని, నిత్యవసర వస్తువులు, వంటనూనెల ధరలను అదుపు చేయాలని, కరెంటు ఛార్జీలు, ఆస్తి, నీటి, చెత్త పన్నుల భారాలను విరమించాలని డిమాండ్ చేస్తూ కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ పెట్రోలు, డీజిల్‌పై కేంద్రం విధించిన సెస్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పన్నులు తగ్గించాలన్నారు. కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుదల ఉపసంహరించుకోవాలని, పెంచిన బస్సు ఛార్జీలను తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత, చెత్త పన్నులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, నియోజకవర్గ నాయకులు చిన్ని సత్యనారాయణ, ఉయ్యాల సత్యనారాయణ, ఉడతా శ్రీను, బోర్లా శ్రీనివాసరావు, సంక్రాంతి వెంకటేశ్వరరావు, పేరుబోయిన ముక్కంటి, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్యుని నడ్డి విరిచే పద్ధతిలో పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచి ప్రజలపై భారం మోపడంపై ప్రజలు పోరాటంలోకి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి ఓబులేశు పిలుపు నిచ్చారు . తిరుపతి మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న పెట్రోలు బంక్ వద్ద వామపక్ష పార్టీ నాయకులు కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఓబులేశు మాట్లాడుతూ కేంద్రంలో

తిరుపతి పెట్రోల్ బంక్ వద్ద నిరసన తెలుపుతున్న ఓబులేశు, రామానాయుడు, సుబ్రహ్మణ్యం, హరీష్, మురళి, విశ్వనాథ్ తదితరులు

విశాఖలో పైడిరాజును బలవంతంగా స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

ఉన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ , రాష్ట్రంలో ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇష్టాను సారంగా అన్నీ రకాల వస్తువులు పై ధరలు పెంచుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం దారుణమని అన్నారు. సీపీఎం నగర కార్యదర్శి టి సుబ్రహ్మణ్యం, ఎస్‌యూసీఐ జిల్లా నాయకులు హరీష్ మాట్లాడుతూ పెరిగిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ సిలిండర్ల ధరలు తగ్గించే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఏ రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పి.మురళి , నగర కార్యదర్శి జె . విశ్వనాథ్ , సీనియర్ నాయకులు కె .కుమార్ రెడ్డి , బి నదియా, నగర కార్యవర్గ సభ్యులు కె రాధాకృష్ణ , ఎన్ డీ రవి, ఎన్.శ్రీరాములు, డి .రామచంద్రయ్య , గోవింద స్వామి, సిహెచ్ శివ, ఏపీ బాల, పూర్ణ , శశికుమార్, బండి చలపతి, ఉదయ్, శ్రీను, హరిత పార్వతి, సీపీఎం నాయకులు లక్ష్మి, వేణు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో వామపక్షాల ప్రదర్శనను అడ్డుకున్న పోలీసులు:

విశాలాంధ్ర - విశాఖ : ప్రజలకు భారంగా మారిన ఆస్తి, చెత్త, నీటి పన్నులు రద్దు చేస్తూ జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని వామపక్ష పార్టీలు డిమాండు చేశాయి. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ప్రదర్శన తలపెట్టడంతో రంగప్రవేశం చేసిన పోలీసులు నిరసన ప్రదర్శనను అడ్డుకున్నారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. పైడిరాజు, సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు బొట్టా ఈశ్వరమ్మ, సీపీఎం ఎంఎల్ జిల్లా నాయకులు రవి, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి ఎస్. గోవిందరాజులు, వామపక్ష నేతలు వి.కృష్ణారావు, కె. సత్యనారాయణ, ఎం. సుబ్బారావు, పి. గోవింద్, ఎం.రాంబాబు, రమణి తదితరులతో పాటు 25 మందిని అరెస్టు చేసి రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి వెళ్లే రహదారులను అన్ని వైపులా పూర్తిగా దిగ్బంధించారు. ఈ సందర్భంగా వామపక్ష నేతలు మాట్లాడుతూ పెంచిన అస్తి, చెత్త, నీటి పన్నులు రద్దు చెయ్యాలని డిమాండు చేశారు. కేవలం వైసీపీ కార్యాలయానికి ఋషికొండలో రెండు ఎకరాలు స్థలం కేటాయించడానికే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేశారనీ, ఇతర ప్రజా సమస్యలు గాలికి వదిలేశారని విమర్శించారు.

కుటుంబపాలనతో తెలంగాణ నాశనం

(మూడో పేజీ తరువాయి)

దాడులు జరుగుతున్న విషయం తన దృష్టికి వచ్చిందని, ఇప్పటికే ముగ్గురు ఆత్మహత్యలు కూడా చేసుకోవడం విచారకరమన్నారు. ఎవ్వరూ ఆత్మస్థైర్యం కోల్పోకుండా కుటుంబ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కుటుంబ పాలన నుండి తెలంగాణ విముక్తి కోసం బీజేపీ అడుగులు వేయాలని ఆయన సూచించారు.

వ్యాపారానికి భారత్ పెట్టింది పేరు

నేడు భారతదేశం అంటేనే వ్యాపారానికి పెట్టింది పేరుగా మారిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక విదేశీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడమే అందుకు నిదర్శమన్నారు. దేశ పాలనా వ్యవస్థలో కీలక మార్పులు తీసుకురావడం వల్లే నేడు ప్రపంచదేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయని చెప్పారు.

రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ అనే మూడు సూత్రాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చిందనే విషయాన్ని యువత గ్రహించి అందుకనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) 20వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రధాన మంత్రి ముందుగా కళాశాల ప్రాంగణంలో మొక్కను నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పతకాలను, ధృవీకరణ పత్రాలను బహూకరించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఐఎస్‌బీ దేశానికే గర్వకారణంగా మారిందని ఆసియా ఖండంలో 5వ ర్యాంకు సాధించడం సంతోషంగా వుందన్నారు. ప్రస్తుత వేడుకతో ఐఎస్‌బీ మరో మైలురాయిని అందుకుందన్నారు. ఇప్పటివరకు ఇక్కడ చదివిన సుమారు 50వేల మంది విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నత స్థానాల్లో పనిచేస్తున్నారని చెపుకొచ్చారు. ముఖ్యంగా మన దేశంలో అతిపెద్ద కంపెనీలకు సీఈఓలుగా, ఉన్నత స్థానాలలో పనిచేయడంతో పాటు చాలా మంది స్టార్టప్‌లను ఏర్పాటు చేసి సేవలు అందించడం గర్వించదగ్గ విషయమన్నారు. ప్రపంచ దేశాలు నేడు భారత దేశ యువతతో పాటు మన దేశంలో తయారవుతున్న వస్తువులను నిశితంగా పరిశీలిస్తున్నాయని పేర్కొన్నారు. నేడు జీ20 దేశాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భారతదేశం ముందువరుసలో వుందని చెప్పారు. వచ్చే 25ఏళ్ళకు నేడు కేంద్ర ప్రభుత్వం రోడ్‌మ్యాప్‌ను తయారు చేసిందని ఈ ప్రణాళికలో యువతకు కీలక పాత్ర వుంటుందన్నారు. భారత్ రికార్డు స్థాయిలో పెట్టుబడులను ఆకర్షిస్తుందంటే దానికి కారణం మన దేశంలోని యువత పై ప్రపంచ దేశాలకు వున్న నమ్మకమే అన్నారు. యువత వ్యక్తిగత లక్ష్యాలనను దేశ లక్ష్యంతో జోడించాలని అపుడు దేశం కూడా అన్ని విధాలుగా దూసుకుపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళి సై సౌందర్‌రాజన్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లాభాలొచ్చినా తప్పని ప్రైవేట్

(మూడో పేజీ తరువాయి)

సంస్థ కూడా ప్రైవేటుబాట పట్టనుందా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మరోవైపు కోల్ ఇండియా లిమిటెడ్‌కు లాభాల పంట పండింది. నికర లాభం 46శాతం మేర పెరిగినట్లు నాల్గో త్రైమాసిక ఫలితాల్లో సంస్థ వెల్లడించింది. ఈ ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో రూ. 6,692.94 కోట్ల నికర లాభాలు సాధించినట్టు తెలిపింది. అంచనాలకు మించి నికర లాభంలో వృద్ధి నమోదు అయింది. అంతకుముందు ఏడాది ఇదే త్రైమాసికంలో కంపెనీ ఏకీకృత నికర లాభం రూ. 4,586.78 కోట్లుగా ఉందని కోల్ ఇండియా లిమిటెడ్ బీఎస్‌ఈ ఫైలింగ్‌లో తెలిపింది. మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో కోల్ ఇండియా ఆపరేషన్ల ద్వారా ఏకీకృత ఆదాయం రూ. 32,706.77 కోట్లు సమకూరిందని, అంతకుముందు ఇదేకాలంలో ఇది రూ. 26,700 కోట్లుగా ఉందని తెలిపింది. మొత్తం ఖర్చులు ఈ త్రైమాసికంలో రూ. 25,161.20 కోట్లకు చేరుకున్నాయని, అంతకుముందు రూ. 21,515.60 కోట్లుగా ఉన్నాయని పేర్కొంది. నాల్గో త్రైమాసికంలో బొగ్గు ఉత్పత్తి 209 మిలియన్ టన్నులకు పెరిగిందని, అంతకుముందు ఏడాది ఇదే కాలంలో 203.42 మిలియన్ టన్నులుగా ఉందని తెలిపింది. జనవరి-మార్చి త్రైమాసికంలో కంపెనీ శిలాజ ఇంధనం కూడా 180.25 మెట్రిక్ టన్నులకు పెరిగింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో 164.89 మెట్రిక్ టన్నులుగా ఉంది. మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో కోల్ ఇండియా పరిమిత ఉత్పత్తి 622.63 మెట్రిక్ టన్నులకు పెరిగింది. అంతకుముందు ఇది 596.22 మెట్రిక్ టన్నులుగా ఉంది. 2021-22కి తుది డివిడెండ్‌ను షేరుకు రూ.3 లెక్కన చెల్లించేందుకు బోర్డు సిఫార్సు చేసిందని కంపెనీ తెలిపింది. దేశంలోని బొగ్గు ఉత్పత్తిలో 80 శాతం కోల్ ఇండియా ద్వారానే సమకూరుతుండటం విదితమే.

మాజీ మంత్రి నారాయణకు హైకోర్టులో ఊరట

ఎలాంటి చర్యలూ తీసుకోవద్దంటూ ప్రభుత్వానికి ఆదేశం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : టీడీపీ మాజీ మంత్రి నారాయణకు గురువారం మరో కేసులోనూ ఊరట లభించింది. ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఉన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతి రింగ్ రోడ్డు భూ సమీకరణలో అక్రమాలు జరిగాయంటూ కొద్దిరోజుల క్రితం వైసీపీ మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ళ రామకృష్ణారెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేసిన విషయం తెల్సిందే. దీనిపై సీఐడీ కేసు నమోదు చేయగా ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న మాజీ మంత్రి పి.నారాయణ, లింగమనేని రమేశ్ సోదరులు, రామకృష్ణ కన్‌స్ట్రక్షన్స్ హైకోర్టును ఆశ్రయించాయి. అసలు ఇన్నర్ రింగ్‌రోడ్డే లేదని, ప్రభుత్వం కావాలని తమపై తప్పుడు కేసునమోదు చేసి వేధింపులకు గురి చేస్తుందని నిందితుల తరపున న్యాయవాది కోర్టుకి తెలియజేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం పిటీషనర్లపై తొందరపాటు చర్యలువద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 9వ తేదీకి వాయిదా వేసింది. దీనికి ముందు పదోతరగతి పరీక్షా పత్రం లీక్‌కేసులో నారాయణను పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై చిత్తూరు కోర్టు ఆయనకు వెంటనే బెయిల్ ఇవ్వడంతో ఇన్నర్ రింగ్ రోడ్డులో అక్రమాలు జరిగినట్లు వైసీపీ ఎమ్మెల్యే అప్పటికప్పుడు ఫిర్యాదు చేసి, అరెస్ట్‌కు సీఐడీపై ఒత్తిడి పెంచారు. ఈ నేపథ్యంలో హైకోర్టును ఆశ్రయించిన నారాయణకు ఊరట లభించింది.

కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లకు షాక్

(మూడో పేజీ తరువాయి)

పరిష్కారంలో ప్రభుత్వం వివక్ష చూపుతోంది.

రూ.4వేలతో కాంట్రాక్టు లెక్చరర్ల నియామకం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు సీఎంగా ఉండగా 143, 144 జీవోల ఆధారంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్ల భర్తీకి శ్రీకారం చుట్టారు. దాదాపు 10వేల మందిని విధుల్లోకి తీసుకోగా, వారికి రూ.4వేల ప్రారంభ వేతనంగా ఇచ్చారు. ఆ తర్వాత వారి వేతనాలు అంచెలంచెలుగా పెంచుకుంటూ వచ్చారు. దాదాపు 20ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఏటా 12 నెలలపాటు(పది రోజుల విరామంతో) రెన్యువల్ చేస్తూ వస్తున్నారు. ఇంతవరకు వారి సర్వీసు క్రమబద్ధీకరించలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో 450 జూనియర్ కళాశాలలుండగా, 3618 మంది కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వారికి ప్రభుత్వ పరంగా రావాల్సిన రాయితీలు దక్కడం లేదు. 2019లో కాంట్రాక్టు లెక్చరర్ల అసోసియేషన్ చేసిన ఉద్యమ ప్రభావంతో 12 నెలలపాటు పొడిగించారు. ఆ విధానానికి స్వస్తి పలికి, ప్రభుత్వం కొత్తగా పది నెలలకు తీసుకు రావడంపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

10 నెలలతో పొడిగింపు దారుణం
-ఏపీ గవర్నమెంట్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు ఈ విద్యా సంవత్సరానికి (2022-23) కేవలం పది నెలలతోనే పొడిగింపు ఇవ్వడం దారుణమని ఏపీ గవర్నమెంట్ కాలేజెస్ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీజే గాంధీ తీవ్రంగా ఖండించారు. కాంట్రాక్టు లెక్చరర్లకు 2019, 2020, 2021 విద్యా సంవత్సరాల్లో 12 నెలలపాటు (పది రోజుల విరామంతో) పొడిగించారని వివరించారు. దురదృష్టవశాత్తూ ఈ విద్యా సంవత్సరానికి పది నెలలకే ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చి అన్యాయం చేసిందన్నారు. విద్యార్థులకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్‌లో పరీక్షల సమయం, అధ్యాపకుల అవసరం ఎంతైనా ఉంటుందన్నారు. వాటిని పరిగణలోకి తీసుకోకుండా, అధికారులు నిర్లక్ష్యంగా ఉత్తర్వులు జారీచేయడాన్ని తప్పుబట్టారు. సీఎం జగన్ తక్షణమే జోక్యం చేసుకుని రెన్యువల్ 12 నెలలు కొనసాగేలా ఉత్తర్వులు జారీచేయాలని, లేకుంటే విద్యా రంగంలోని ఉపాధ్యాయులు, లెక్చరర్లను కలుపుకుని పెద్దఎత్తున ఉద్యమానికి సన్నద్ధమవుతామని హెచ్చరించారు.

మహానాడుకు ముస్తాబైన ఒంగోలు

(మూడో పేజీ తరువాయి)

మహానాడులో చర్చించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు 12 వేల మంది ప్రతినిధులతో శుక్రవారం సభ ప్రారంభం కానుంది. చివరి రోజు సాయంత్రం లక్ష మందితో భారీ బహిరంగసభను నిర్వహించనున్నారు. మహానాడుకు ముందు పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలకు ఒంగోలులో చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టనున్నారు. ఒంగోలు సమీపంలోని మండువారిపాలెంలో 85 ఎకరాల విస్తీర్ణంలో సభా ప్రాంగణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఒంగోలు నుంచి మద్దిపాడు వరకు అంతా పసుపుమయం అయ్యింది. తెలుగుదేశం పార్టీ తోరణాలు, ఫ్లెక్సీలతో అలంకరించారు. మహానాడు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సభ నుంచి ప్రతినిధుల సభ వేదిక, అక్కడే లక్ష మందితో బహిరంగ సభ ఏర్పాట్లతో పాటు పక్కనే భోజనశాల, ఫోటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరం, సభ్యత్వ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహానాడు నిర్వహణ కోసం ముందుగానే ఏర్పాటు చేసిన వివిధ కమిటీలు ఆయా పనుల్లో నిమగ్నమయ్యాయి. గురువారం సాయంత్రమే ఒంగోలుకు బయలుదేరిన పార్టీ అధినేత చంద్రబాబుకు ప్రకాశం జిల్లా సరిహద్దుల్లో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో భారీ స్వాగతం పలికారు. ఐదు వేల బైకులతో ర్యాలీ నిర్వహించారు. గజమాలతో చంద్రబాబును సత్కరించి ఒంగోలు గిత్తల ఎడ్ల బండిపై ర్యాలీ నిర్వహించారు. అద్దంకి నియోజకవర్గంలోకి ప్రవేశించిన చంద్రబాబుకు ఆ నియోజకవర్గ శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ స్వాగతం పలికారు. సంతనూతలపాడు వద్ద టీడీపీ నేతలు దామచర్ల జనార్ధన్, సత్య ఆధ్వర్యంలో భారీ స్వాగతం లభించింది. వేలాదిమందితో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల చంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగన్ ఇంటికెళ్లడం ఖాయమని జోష్యం చెప్పారు. మహానాడును అడ్డుకునేందుకు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారని పేర్కొన్నారు. కనీసం ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని తెలిపారు. అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని వైసీపీకి కొమ్ముకాస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఫ్లెక్సీలు తోరణాలు కట్టకుండా ఆటంకాలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తగిన మూల్యం చెల్లించకతప్పదని అన్నారు. కోనసీమ జిల్లా, అమలాపురంలో అల్లర్లు సృష్టించి జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారని తెలిపారు. అయినా తెలుగుతమ్ముళ్లు కొండవీటి సింహంలా గర్జిస్తూ మహానాడుకు తరలివస్తున్నారని తెలిపారు.

ఆకర్షణ అరకొరే !

(మూడో పేజీ తరువాయి)

వ్యవస్థాపకులు, సీఈఓలతోనూ ఇదే అంశంపై సీఎం భేటీ అయ్యారు. ఏపీలో విద్యారంగానికి తోడుగా నిలుస్తామని బైజూస్ ప్రకటించింది.పరిశోధక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని వెల్లడించింది. పాఠ్యప్రణాళికను ఏపీ విద్యార్థులకు అందిస్తామని సీఎంతో జరిగిన సమావేశంలో సంస్థ సీఈఓ రవీంద్రన్ వెల్లడించారు. సమగ్ర భూ సర్వే రికార్డుల నిక్షిప్తం చేయడంతో పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తామన్న కాయిన్‌స్విచ్ క్యూబర్ ప్రకటించింది. ఏపీలో పర్యాటక రంగ అభివృద్ధికి తమవంతు చేయూత నిస్తామని, రవాణా రంగానికి తోడుగా నిలుస్తామని ఈజ్‌మై ట్రిప్ వెల్లడించింది. ఇక దావోస్ వేదికపై వైద్యం, ఆరోగ్యం, విద్యా తదితర రంగాల్లో రాష్ట్రం సాధించిన ప్రగతిని ముఖ్యమంత్రి వివరించారు.

వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో ఫ్యూచర్ ప్రూఫింగ్ హెల్త్ సిస్టమ్స్ పై పబ్లిక్ సెషన్‌లో పాల్గొన్న సీఎం జగన్, కోవిడ్ నియంత్రణకు తీసుకున్న చర్యలను, రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడానికి విప్లవాత్మకంగా చేపడుతున్న మార్పులను వివరించారు. ఇలా ఎక్కువశాతం దావోస్ సదస్సులో హామీలు తప్ప రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి, ఎంవోయూలు చేసుకోవడానికి ప్రభుత్వం ఆశించిన స్థాయిలో పారిశ్రామికవేత్తలు ముందుకు రాలేదు.

జుమ్లాలు, నినాదాలతోనే సరి

- దుస్థితికి, దుష్పరిపాలనకు చిహ్నం
- అచ్చేదిన్ క్రోని కేపిటలిస్టులకేగానీ సామాన్యులకు కాదు

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వ పాలన ప్రజల కష్టాలకు, దుష్పరిపాలనకు చిహ్నంగా నిలిచిందని ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శించింది. ఇది అమృత కాలం కాదు.. ఇది విష కాలం అంటూ అసహనం వ్యక్తంచేసింది. పెద్ద నోట్ల రద్దు నుంచి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని, వరుస పెట్టి ఈ ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయా లతో దేశ ఆర్థిక వ్యవస్థ పతనమైందని దుయ్య బట్టింది. మోదీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రముఖంగా పేర్కొంటూ 'ఎనిమిదేళ్లు, ఎనిమిది మోసాలు, బీజేపీ సర్కార్ వైఫల్యం' అన్న కరపత్రాన్ని కాంగ్రెస్ విడుదల చేసింది. సైనికుల శౌర్యం పేరిట ఓట్లు అడ్డుకున్నారని, బీజేపీ హయాంలో 10వేలకుపైగా మత ఘర్షణల కేసులు నమోదు అయ్యాయని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సంక్షేమం మరుగున పడిం దని, అనేక సంస్థల్లో ఖాళీలు భర్తీ కాలేదని, కార్పొ రేట్లకు ఊడిగం చేయడంతోనే మోదీ ఎనిమిదేళ్ల పాలన సాగిందని కాంగ్రెస్ దుయ్యబట్టింది. మోదీ ప్రభుత్వం ఎనిమిదేళ్ల పాలన కాలాన్ని పూర్తి చేసుకున్న క్రమంలో దేశవ్యాప్తంగా వేడుకలు నిర్వహిస్తూ తమ హయాంలో సాగినది అమృత కాలంగా చెప్పుకుంటుండటంపై కాంగ్రెస్ మండి పడింది. తారాస్థాయికి చేరిన ద్రవ్యోల్బణం, గరిష్ఠంగా నిరుద్యోగిత, పేట్రేగిన మతతత్వం, మత ఘర్షణలతో మోదీ ఎనిమిదేళ్ల పాలన సాగిందని కాంగ్రెస్ నేతలు రణదీప్ సూర్జేవాలా, అజయ్ మాకెన్ గురువారం సంయుక్త విలేకరుల సమా వేశంలో విమర్శలు గుప్పించారు. ఎనిమిదేళ్ల నకిలీ జుమ్లాలు.. నినాదాలతో గడిచాయని, సొంత ప్రజలను మూఢాచారంలోకి నెట్టే రికార్డులను మోదీ ప్రభుత్వం బద్దలు కొట్టిందని వ్యాఖ్యానిం చారు. అచ్చే దిన్ కేవలం ఆ పార్టీకేగానీ దేశ ప్రజలకు కాదని అన్నారు. క్రోని పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తల సంపద మోదీ హయాంలో అనేకరెట్లు పెరగిందని అన్నారు. బీజేపీ ప్రభుత్వ వినాశకర విధానాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని మాకెన్ విమర్శించారు. ఒకప్పుడు అత్యంత వేగంగా పెరిగే ఆర్థిక వ్యవస్థ ఉంటే బీజేపీ దుష్పరిపాలనలో మాంద్యం, ద్రవ్యోల్బణం, నిరు ద్యోగంలో ఆల్ టైం రికార్డులు నమోదయ్యాయని వ్యాఖ్యానించారు. బీజేపీ పాలన దేశ భద్రతకు, సార్వభౌమత్వానికి ముప్పుగా ఉండగా సరిహద్దుల్లో చైనా చొరబాట్లు పెరిగినా ప్రధాని మౌనంగా ఉన్నారని సూర్జేవాలా అన్నారు. మోదీ 56 అంగు ళాల ఛాతీకి.. ఎర్రకళ్లకు ఏమైందంటూ ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికలప్పుడు బీజేపీ ఇచ్చిన నినాదాలన్నీ తప్పుగా రుజువు అయ్యాయని, ఈ విషయాన్ని ప్రజలు గ్రహిస్తున్నారన్నారు. కోవిడ్ కాలంలో ప్రతి భారతీయుని సగటు ఆదాయం పడిపోగా మోదీ కేపిటలిస్టు దోస్తుల సంపద బహుళ రెట్టు అధికమైందని.. బీజేపీ చెప్పిన అచ్చే దిన్ ఎవరికి వచ్చాయో అందరికి తెలుసు అంటూ సూర్జేవాలా వ్యాఖ్యానించారు.

కళల పాత్ర నిరుపమానం

(మూడో పేజీ తరువాయి)



చేస్తున్నారని కొనియాడారు. కళలకు నిలయమైన కడప జిల్లాలో ఈ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమ న్నారు. ప్రజానాట్య మండలి ఆవిర్భవించినప్పటి నుంచి ప్రజల సమస్యలపైన కళలు జనరంజకంగా పనిచేసి సాధించినవి ఎన్నో ఉన్నాయని అన్న చెప్పారు. మాదాల రవి మాట్లాడుతూ ప్రజలను రంజింపచేసేది కళలేనన్నారు. ఈ కళలు ప్రపంచం తయారు చేసిన ఆయుధాల కంటే గొప్పవన్నారు. 50 సుమోలు లేపడం, వంద మందిని చంపడం కాదని నిజమైన హీరోలంటే ఒక భగత్‌సింగ్, ఒక అంబేద్కర్ లాంటి వారన్నారు. ప్రజాదరణ పొందిన నాంపల్లి స్టేషన్ కాడ అనే గీతాన్ని ప్రజానాట్య మండలి కళాకారుడు ప్రభు రచించారని ఆ పాట యావత్ ప్రపంచాన్ని ఉర్రూతలూగించిదని వెల్లడించారు. కళలకు నిలయమైన కడప జిల్లాలో ఈ ఉత్సవాలు జరగడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఎప్పుడూ కళలపై శ్రద్ధ పెట్టి సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలన్నారు. కళాకారులుగా ఉన్న వారికి గుర్తింపు రాకపోయినా నిజమైన హీరోలు వారేనన్నారు. ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రజలను చైతన్య పరచడంలో కళలు ముందుంటాయని అలాంటి కళాకారుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి పెన్షన్లు వంటి సౌకర్యాల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. కళలు సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి ఎంతగానో దోహదపడతాయని కొనియాడారు. పీజే చంద్రశేఖర్ మాట్లాడుతూ... కళాకారుల ప్రదర్శనలతో ఎన్నో పోరాటాలు విజయవంతమయ్యాయని ఆ పోరాటాల బాటలోనే ప్రజా నాట్యమండలి కళాకారులు కొనసాగుతుండడం గర్వించదగ్గ విషయమన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ. సమాజంలోని రుగ్మతలను పారదోలి బానిసత్వం నుంచి ప్రజలను కార్యోన్ముకులను చేయడానికి స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి ప్రజానాట్యమండలి కళాకారులు అహర్నిశలు కృషి చేస్తున్నారని, ఇది ఎంతో అభినందించదగ్గ విషయమన్నారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో శ్రీనివాసరావు, రామకృష్ణ, కార్యదర్శులు నాగరాజు, చంద్రశేఖర్, నళిని, గుంటి వేణుగోపాల్, వెంకటశివ, మద్దిలేటి, వలరాజు, బషీరున్నిసా, వివిధ జిల్లాల నుంచి వచ్చిన కళాకారులు పాల్గొన్నారు.

నిజాంను మించిన నియంత మోదీ

సీపీఐ కార్యదర్శి నారాయణ



విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిజాంను మించిన నియంత అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. గురువారం మోదీ హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో చోటు చేసుకున్న పరిణామాలపై నారాయణ ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం ఒక వీడియోను మీడియాకు విడుదల చేశారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) విద్యార్థుల భావ స్వేచ్ఛను హరించవద్దని, వారిపై పీఎంవో నిఘాను ఎత్తివేయాలని తాను చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తనను సాయంత్రం 7 గంటల వరకు గృహ నిర్బంధంలో ఉంచారని తెలిపారు. తెలంగాణ చరిత్రలో నియంత అయిన నిజాం పర్యటనల సందర్భంలోనూ ఇటువంటి అణచివేతలు లేవని పేర్కొన్నారు. ప్రధానమంత్రి పర్యటన పేరుతో నగర ప్రజలపై పోలీసుల వేధింపులు దారుణమన్నారు. ట్రాఫిక్‌ను మొత్తం నిలిపివేసి ప్రజల సాధారణ జీవితాన్ని అతలాకుతలం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని పర్యటన ప్రజలను ఇబ్బంది పెట్టడానికేనా అని నిలదీశారు. ప్రధాని పర్యటన క్రమంలో రాజకీయ పార్టీగా సీపీఐ కొన్ని అభిప్రాయాలను వ్యక్తం చేసిందనీ, అంత మాత్రాన పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి సహా, పార్టీ కార్యాలయాల వద్ద నుంచి పెద్ద ఎత్తున కార్తకర్తలను, నేతలు అరెస్టు చేయడాన్ని నారాయణ తప్పుబట్టారు. హైదరాబాద్ నగరంతో సంబంధం లేని ప్రాంతాల నేతలను కూడా అరెస్టు చేశారన్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా రాష్ట్రంలో లేకుండా పోయిన సీఎం కేసీఆర్ ప్రతిపక్ష రాజకీయ పార్టీల నేతలను నిర్బందించాలని పోలీసులకు అదేశాలిచ్చినట్టు అనుమానం వ్యక్తం చేశారు. ఇదంతా రాజకీయ డ్రామాగానే ఉందని నారాయణ వ్యాఖ్యానించారు.

మోదీ పర్యటనకు కేసీఆర్ మరోసారి దుమ్మా

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మరోమారు ప్రధాని నరేంద్రమోదీ పర్యటనలో పాల్గొనకుండా దుమ్మా కొట్టారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి) 20వ వార్షికోత్సవంలో వేడుకల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ హైదరాబాద్ చేరడానికి కొన్ని గంటల ముందు కేసీఆర్...గురువారం ఉదయం బెంగళూరుకు బయలుదేరారు. గత నాలుగు నెలల్లో హైదరాబాద్ పర్యటనలో మోదీని కలవకుండా కేసీఆర్ తప్పించుకోవడం ఇది రెండోసారి. ఇంతకుముందు ఫిబ్రవరిలో సెయింట్ రామానుజాచార్య అతిపెద్ద విగ్రహాన్ని ఆవిష్కరించడానికి మోదీ హైదరాబాద్‌కు రాగా, 'అస్వస్థత' కారణంగా కేసీఆర్ ప్రధానిని కలవలేక పోయారని అధికారిక వర్గాలు తెలిపాయి. కాగా గురువారం బెంగళూరు వెళ్లిన కేసీఆర్, మాజీ ప్రధాని, జేడీఎస్ అధినేత హెచ్‌డి దేవెగౌడ, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి కుమార స్వామిలను కలిశారు. వారితో కలిసి భోజనం చేశారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిణామాలు, జాతీయ రాజకీయాలు, రాష్ట్రాల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై దేవెగౌడ, కుమారస్వామితో కేసీఆర్ చర్చించారు. త్వరలో జరగనున్న రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల అంశాన్ని కూడా చర్చించినట్లు తెలుస్తోంది. కేసీఆర్ పర్యటన సందర్భంగా బెంగళూరులో కటౌట్‌తో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దేశ్‌కి నేత అంటూ ఫ్లెక్సీలు వెలిశాయి.

కోవాక్సిన్‌కు జర్మనీ గుర్తింపు

హైదరాబాద్: భారత్ బయోటెక్ ఆవిష్కరించిన కోవిడ్-19 వాక్సిన్ కోవాక్సిన్‌ను వేయించుకున్న వారిని జూన్-1వ తేదీనుంచి తమ దేశం లోకి అనుమతిస్తున్నట్లు భారత్‌లో జర్మన్ రాయబారి వాల్టర్ జె లిండ్నర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. 'జూన్ 1 నుండి జర్మనీ ప్రయాణాల కోసం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఆమోదించిన కోవాక్సిన్‌ని గుర్తించాలని జర్మనీ ప్రభుత్వం నిర్ణయించినందుకు చాలా సంతోషంగా ఉంది! ఈ ఎంబసీ అటువంటి నిర్ణయం కోసం ఒత్తిడి చేస్తోంది' అన్నారు. గత ఏడాది నవంబర్‌లో డబ్ల్యూహెచ్‌ఓ, కోవాక్సిన్ టీకాకు అత్యవసర వినియోగ జాబితా (ఈయూఎల్) స్థితిని సిఫార్సు చేసింది. ఆస్ట్రేలియా, జపాన్, కెనడాతో సహా అనేక దేశాలు కోవాక్సిన్ టీకాలు వేయించుకున్న వారిని ఆయా దేశాల్లోకి అనుమతిస్తున్నాయి.

తిరుపతిలో మున్సిపల్ కార్మికుల

మెరుపు సమ్మె

- రూ.1.5 కోట్ల బకాయిలు తక్షణం విడుదల చేయాలి
- సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమం: తులసేంద్ర

విశాలాంధ్ర -తిరుపతి: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో వున్న సమస్యలు పరిష్కరించాలని ఎన్ని సార్లు అధికారులకు విన్నవించిన ఫలితం లేకపోవడంతో తాడో పేడో తేల్చుకోవడానికి తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు సిద్ధమయ్యారు. కార్మికులు మెరుపు సమ్మెకు దిగారు. కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న వెయ్యి మంది పారిశుద్ధ్య కార్మికులు గురువారం కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బి.తులసేంద్ర మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా కార్మికులకు జీతాలు ఇవ్వడం లేదన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాల అవసరాలకు ఉపయోగపడని పాలన ఎందుకని అధికారులను ప్రశ్నించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు, పనిముట్లు లేక కార్మికులు పనులు నిర్వహించ లేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తోపుడు బండ్లు , డబ్బాలు లేక ఇంటింటి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదనీ, అవసరమైన వాహనాలు సరైన సమయానికి రాక చెత్త సేకరణలో తీవ్రమైన అడ్డంకులు ఎదురవుతున్నాయన్నారు. యూజర్ ఛార్జీలు ఎందుకు చెల్లించాలని ప్రజలు వర్కర్లను నిలదీస్తున్నారనీ, దాడులకు పూనుకుంటున్నారని, ఫలితంగా వీధుల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయన్నారు . కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ జీతాలు రూ.1.5 కోట్లు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐ చెల్లించకపోవడం వల్ల వైద్యం చేయడానికి వైద్యశాల నిరాకరిస్తోందని, కార్మికులు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి గుర్రప్ప, ఉపాధ్యక్షులు మదన్ మోహన్, యూనియన్ నాయకులు తాతారావు, ఏలుమలై, సుబ్రమణ్యం, ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

నేడు డ్రోన్ ఫెస్టివల్‌ను ప్రారంభించనున్న మోదీ

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారత దేశపు అతిపెద్ద డ్రోన్ ఫెస్టివల్- భారత్ డ్రోన్ మహోత్సవ్ 2022ను మే 27న ఉదయం 10 గంటలకు దేశ రాజధానిలోని ప్రగతి మైదాన్‌లో ప్రారంభించనున్నారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం గురువారం వెల్లడించింది. పీఎం మోదీ కిసాన్ డ్రోన్ పైలట్‌లతో కూడా ఆయన సంభాషించనున్నారు. భారత్ డ్రోన్ మహోత్సవ్- 2022 రెండు రోజుల కార్యక్రమం మే 27, 28 తేదీల్లో నిర్వహించనున్నారు. 'ప్రభుత్వ అధికారులు, విదేశీ దౌత్యవేత్తలు, సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ కంపెనీలు, డ్రోన్ స్టార్టప్‌లతో కూడిన 1600 మంది ప్రతినిధులు మహోత్సవ్‌లో పాల్గొంటారు. ఎగ్జిబిషన్‌లో 70 మందికి పైగా ఎగ్జిబిటర్లు డ్రోన్‌లకు సంబంధించి వివిధ వినియోగ కేసులను ప్రదర్శిస్తారు' అని' పీఎంఓ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. మహోత్సవ్‌లో డ్రోన్ పైలట్ సర్టిఫికెట్లు, ఉత్పత్తి లాంచ్‌లు, ప్యానెల్ చర్చలు, ఫ్లయింగ్ ప్రదర్శనలు, మేడ్ ఇన్ ఇండియా డ్రోన్ టాక్సీ ప్రోటోటైప్ ప్రదర్శన మొదలైన వాటితో కూడిన వర్చువల్ అవార్డును కూడా చూడవచ్చు.

తెలుగు రాష్ట్రాల్లో

నాలుగు రోజులు వర్షాలు

- తమిళనాడు, లక్షద్వీప్‌లోనూ..
- కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు
- ఆ రాష్ట్రంలోనూ భారీ వర్షాలకు అవకాశం
- భారత వాతావరణ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ / హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో మరో నాలుగు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై తేలిక పాటి నుంచి మోస్తారు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. నైరుతి రుతుపవనాలు దక్షిణ శ్రీలంక మీదుగా కేరళ వైపునకు కదులుతున్నట్లు తెలిపింది. దీంతో రానున్న 48 గంటల్లో నైరుతి రుతుపవనాలు దక్షిణ అరేబియా, మాల్దీవులు, లక్షద్వీప్‌లోని పరిసర ప్రాంతాల మీదుగా చురుగ్గా కదులుతాయని ఐఎండీ వెల్లడించింది. ఈ కారణంగా ఏపీ, తెలంగాణతో పాటు కేరళ, తమిళనాడు, లక్షద్వీప్‌లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. ఏపీలోని ఉత్తర కోస్తాంధ్ర, యానాంలలో మూడు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లోనూ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ సంస్థ తెలిపింది. కేరళలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని, లక్షద్వీప్‌లోనూ వర్షం పడుతుందని ఐఎండీ తెలిపింది. నైరుతి రుతుపవనాల కదలికలను నిశితంగా గమనిస్తున్నట్లు పేర్కొంది. సాధారణంగా జూన్ 1న కేరళను రుతుపవనాలు తాకు తాయిగానీ ఈసారి మే 27నే ప్రవేశిస్తాయని ఇంతకు ముందే ఐఎండీ వెల్లడించింది. కాగా, ఈనెలారంభంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అసని తుపాను కారణంగా నైరుతి రుతుపవనాలు వేగం పుంజుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఇదిలావుంటే, తెలంగాణలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. నాలుగు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని హెచ్చరించింది. ఈ క్రమంలో ఎల్లో అలర్ట్ జారీ అయింది. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, జగిత్యాల, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, కొమురం భీం, మహబూబాబాద్, మహబూబ్ నగర్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజ్ గిరి, ములుగు, నాగర్ కర్నూల్, నల్గొండ, నారాయణపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, హైదరాబాద్, ఖమ్మం, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, నల్గొండ, రంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి వంటి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

క్విట్ జగన్-సేవ్ ఏపీ

- ఇదే రాష్ట్ర ప్రజల నినాదం కావాలి
- మహానాడుకు వెళుతూ చంద్రబాబు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : విభజన కంటే ఎక్కువగా నష్టపోయిన రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి క్విట్ జగన్-సేవ్ ఏపీ నినాదం రాష్ట్రంలో మారుమ్రోగాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం చంద్రబాబు భారీ కార్ల ర్యాలీతో ఒంగోలు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుతమ్ముళ్ల ఉత్సాహం చూస్తుంటే చెప్పలేనంత ఆనందం కలుగుతోంది. మహానాడుని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్న ఈప్రభుత్వం కంపించిపోయేలా ప్రజలంతా భారీగా మహానాడుకి తరలిరావాలి. క్విట్ జగన్, సేవ ఆంధ్రప్రదేశ్ నినాదాలతో మహానాడు ప్రాంగణమేకాదు యావత్ రాష్ట్రం దద్దరిల్లాలని పేర్కొన్నరు. తెలుగుదేశంపార్టీని, కార్యకర్తల్ని ఇబ్బందులు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్న జగన్ రెడ్డీ.. నువ్వు చేసేవాటికి చక్రవడ్డీతో సహా భవిష్యత్తులో తిరిగి చెల్లిస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ అధికారులు మహానాడుకి బస్సులడిగితే ఇవ్వరా? జగన్మోహన్ రెడ్డికి ఊడిగం చేస్తూ, మహానాడుకి బస్సులు ఇవ్వకుండా నాటకాలు ఆడుతారా? మీరు ఇవ్వక పోగా, ప్రైవేట్ ట్రావెల్స్, పాఠశాలలు బస్సులు ఇస్తామంటే వారిపైకి ఆర్టీఏ అధికారుల్ని పంపిస్తారా? మాపార్టీ ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టుకోనివ్వరా? ఈ రాష్ట్రం మీజాగీరా? మీ ఆటలు సాగనివ్వమని చంద్రబాబు ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇలాంటి చిల్లర, పనికిమాలిన ముఖ్యమంత్రిని ఇంతవరకు తాను చూడలేదన్నారు. ఇతనొక సైకో, అభివృద్ధిలో దూసుకుపోతున్న రాష్ట్రాన్ని మూడేళ్ళలోనే సర్వనాశనం చేశారని ఆయన మండిపడ్డారు. మహానాడుకి మేం ఇబ్బందులు కలిగించడం లేదని ఒక మంత్రి అంటున్నాడు. ఒంగోలులో స్టేడియం ఇమ్మంటే ఎందుకు ఇవ్వలేదు? ప్రకాశం జిల్లా ఎస్పీ, సహా ఇతర అధికారులు ప్రభుత్వానికి భయపడుతున్నారు. మహానాడు ఎలా ఉంటుందో మీరేచూస్తారు. ఇది ఒక ప్రభంజనం, ఎక్కడికక్కడ కట్టలు తెంచుకొని ఉరకలు వేసే ఉత్సాహంతో తమ్ముళ్ళు, చెల్లెమ్మలు మహానాడుకి తరలిరావాలి. ఏవాహనం దొరికితే దానిలో రండి. ఎద్దులబళ్లపై రండి... అవసరమైతే కాలినడకనరండి. మీరుఎలావస్తారో తెలియదు. కానీ మహానాడుని జయప్రదం చేస్తామని గట్టిగా చెప్పండి. ఈ మహానాడు ద్వారా రాష్ట్రమంతా క్విట్ జగన్-సేవ్ ఆంధ్రప్రదేశ్ అనే నినాదం మారుమోగాలి. రాష్ట్రంలో ఏ ఒక్క వర్గమూ సుఖంగా లేరు. అభివృద్ధి శూన్యమై ఉపాధి అవకాశాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలోనే మీ తరుపున పోరాడటానికి వచ్చాను. నా ఆలోచన, కష్టం అంతా రాష్ట్రం కోసమే. పార్టీ శ్రేణులు కూడా ఒక్కొక్కరు ఒక సైనికుడిలా త్యాగాలకు సిద్ధం కావాలని, మహానాడును జయప్రదం చేయాలని చంద్రబాబు కోరారు.

మహారాష్ట్ర మంత్రిపై ఈడీ కేసు

న్యూఢిల్లీ / ముంబై: మహారాష్ట్ర మంత్రి అనిల్ పరబ్‌తో పాటు ఇంకొందరిసై ఈడీ కేసు పెట్టింది. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించింది. వారి ఆస్తులను సోదా చేసింది. రత్నగిరి జిల్లా, దపోలీ ప్రాం తంలో భూ ఒప్పందం నేపథ్యంలో మంత్రితో మరికొందరిపై పీఎంఎల్‌ఏ కింద తాజా కేసును దాఖలు చేసినట్లు అధికారులు గురువారం వెల్లడించారు. ముంబై లోని మంత్రి అధికారిక నివాసంతో పాటు దపోలీ, పూనేలోని ఆస్తులను సోదా చేశామని, తనిఖీల ప్పుడు మంత్రి ఇంట్లోనే ఉన్నారన్నారు. పరబ్ (57) శివసేన శాసన సభ్యుడు. మూడుసార్లు అసెంబ్లీకి ఎన్నిక య్యారు. రాష్ట్ర రవాణా మంత్రిగా ఉన్నారు. అవినీతి, అక్రమాల నేపథ్య ఆయనపై అనేక ఆరోపణలు ఉన్నాయి. 2017లో దపోలీలో కోటి రూపాయలకు భూమి కొని 2019లో రిజిస్ట్రేషన్ చేయించారు. 2020లో ముంబైకు చెందిన కేబుల్ ఆపరేషన్ సదా నంద్ కదమ్‌కు రూ.1.10 కోట్లకు దీనిని అమ్మారు. 2017 నుంచి 2020 వరకు ఈ భూమిపై రిసార్టు ఉంది అని ఈడీ అధికారులు తెలిపారు.

మహిళలు శక్తి స్వరూపులు

- అన్ని రంగాల్లో సామర్థ్యానికి తగ్గ ప్రాతినిధ్యం అవశ్యం
- స్త్రీల పట్ల సమాజ ఆలోచన మారాలి
- కేరళ సదస్సులో రాష్ట్రపతి కోవింద్

తిరువనంతపురం: మహిళా సాధికారత జరిగినప్పుడు సమాజం సాధికారత సాధిస్తుందని రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ అన్నారు. అన్ని రంగాల్లో మహిళల సామర్థ్యానికి తగ్గట్లుగా ప్రాతినిధ్యం లేదని, ఈ విషయంలో సామా జిక ఆలోచన వైఖరిలో మార్పు ఎంతో అవసరమని నొక్కిచెప్పారు. శ్రామిక శక్తిలో మహిళలకు అధిక ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. ఏడు దశాబ్దాల్లో స్థానిక సంఘాల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించగలిగామని చెప్పారు. దీనిని మహిళా సాధికారత అనడం అపోహ అవుతుందని అన్నారు. రాజకీయాల్లో మహిళా ప్రాతినిధ్యం పెరిగితే అది సాధికారత అవుతుందని, అప్పుడే సమా జం కూడా సాధికారత సాధిస్తుందన్నారు. వారు 'శక్తి' స్వరూపులని మరువద్దు అని రాష్ట్రపతి తెలి పారు. కోవింద్ గురువారం కేరళలో జరిగిన మహిళా శాసనసభ్యుల జాతీయ సదస్సులో మాట్లాడారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్ర మాల క్రమంలో తొలిసారిగా ఇలాంటి సదస్సు జరిగింది. భారతీయ స్వాతంత్ర్య సమరంలో, బ్రిటిష్ పాలకుల వ్యతిరేక పోరాటంలో మహిళలు కీలక పాత్ర పోషించారని కోవింద్ అన్నారు. రాణి లక్ష్మి బాయ్, కస్తూర్బా గాంధీ, సరోజినీ నాయుడు వంటి మహిళామణుల అమూల్యమైన సేవలను గుర్తు చేశారు. రాజ్యాంగ రూపకర్తల్లో 15 మంది మహి ళలు సంవిధానంలో సభ్యులుగా ఉంటే వారిలో ముగ్గురు కేరళ వారన్నారు. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమేటిక్స్, మేనేజ్‌మెంట్ 'ఎస్‌టీఈ ఎంఎం'లో మహిళా ప్రాతినిధ్యం పెరుగుతోందని, కరోనా యోధుల్లో పురుషుల కంటే మహిళల సంఖ్యే ఎక్కువని, జనాభాలో దాదాపు సగంగా వారున్నా రన్నారు. సమాజంలో నాటుకున్న వివక్ష పోవాలని, సామర్థ్యానికి తగ్గట్లుగా శ్రామిక శక్తిలో ప్రాతినిధ్యం మహిళలకు ఉండాలని అన్నారు.

ఝుల్లుమన్న జానపదం

అరుణకాంతులతో అలరారిన కడప నగరం

విశాలాంధ్ర-కడపబ్యూరో: కడప నగరం అరుణ కాంతులతో అలరారింది. ఎర్రటి జెండాలతో కాంతులీనింది. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి 10 వ రాష్ట్ర మహాసభల సందర్భంగా కడప నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కళాక్షేత్రం వరకు సీపీఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య నేతృత్వంలో భారీ ర్యాలీ జరిగింది. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సినీ కళాకారులు, ప్రజానాట్య మండలి కళాకారుల డప్పులు, నృత్యాలతో కడప నగరం మారుమ్రోగింది. కళాక్షేత్రంలో కళాకారుల జానపద ప్రదర్శనలు ఝుల్లుమనిపించాయి. నగరం నడివీధుల మీదుగా జరిగిన ప్రదర్శనలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య... ప్రజానాట్యమండలి కళాకారుల నృత్యాలతో జతకలిసి నృత్యాలు చేసి కళాకారులను, కార్యకర్తలను ఉత్తేజపరిచారు. ఈ ప్రదర్శన ఆద్యంతం కళాకారులు... వివిధ కళారూపాలు, ప్రదర్శనలతో చూపరులను ఆకట్టుకున్నారు. కళలు కళ కోసం కాదని, ప్రజా చైతన్యం కోసమని కళాకారుల కంఠాలు నినదించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), ప్రధాన కార్యదర్శి చంద్ర నాయక్, విప్లవ సినీ నటుడు మాదాల రవి, డైరెక్టర్ బాబ్జి, ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు గుజ్జల ఓబులేశు, ప్రజానాట్యమండలి నాయకులు, సీపీఐ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అలరించిన బుర్రకథ

మాదాల రంగారావు కళాక్షేత్రం (నేక్‌నామ్ కళాక్షేత్రం)లో ఉత్సవాల్లో మొదటి రోజు గురువారం బుర్రకథ ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం నుంచి పాల్గొన్న బుర్రకథ కళాకారులు ప్రేమానందం, గోవిందు, బాబ్జీ, శేషగిరి రావులు అల్లూరి సీతారామరాజు పైన బుర్రకథను ఆలపించి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.